www.prajaswaramdaily.com
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 283 | పేజీలు : 10 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | ఆదివారం 23-06-2024

MHR TV
www. mhrtv.com

# గనుల వేలంపై చర్చకు సిద్ధం



- కోల్ మైనింగ్ చట్టానికి గతంలో బీఆర్ఎస్ మద్దతు తెలిపింది
- నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మెదక్ ను అభివృద్ధి చేస్తా
- నీట్ అవకతవకలపై విపక్షాలవి దుష్ప్రచారం
- మల్లన్న సాగర్ సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ఎంపీ రఘునందర్ రావు

**హైదరాబాద్ జూన్ 22, (ప్రజాస్వరం) :** మనుషులను మనుషులుగా చూడని ముఖ్యమంత్రులను వద్దని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు నిరూపించారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అందుకే ఉభయ రాష్ట్రాల ప్రజలు వారికి వ్యతిరేకంగా తగిన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పలు అంశాలపై స్పందించారు. ఇందిరాగాంధీ వచ్చి పోటీ చేసిన తర్వాత మెదక్ అభివృద్ధి జరిగిందనడం ఉత్తమాట అని ఎంపీ వెల్లడించారు. అంతకు ముందే మెదక్ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మెదక్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని రఘుందన్ రావు హామీ ఇచ్చారు. త్వరలో ఆర్ఆర్ఆర్ కూడా రాబోతుందని, పరిశ్రమలు నగరానికి దూరంగా తరలించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఐటీఐఆర్ను గతంలో మన్మోహన్ సింగ్ ప్రతిపాదించారని, ఐటీఐఆర్ కింద ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్రం పూర్తి మిగతా 2 లో..



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఎన్టీరామారావు దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

# తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలువాలి

## ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పోటీ పడే అవకాశం వచ్చింది

- ఆయనలా 18 గంటలు కష్టపడతా
- అభివృద్ధి, సంక్షేమంలో పరస్పర సహకారం తీసుకుంటాం
- తెలంగాణలో వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు
- హైదరాబాద్‌లో అన్నిరకాల వైద్య సేవలు ఉండేలా తీర్చిదిద్దుతాం
- బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రితో కోట్లాది మంది పేదలకు మేలు జరిగింది
- ఎన్టీఆర్ మూడో తరం దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలి
- దవాఖాన 24వ వార్షికో త్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 22, (ప్రజాస్వరం) :** మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్స ర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 24 ఏండ్లుగా కోట్లాది మందికి వైద్య సేవలందించడం హర్షణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్యాన్సర్ ఆస్పత్రి 24 వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం ఆనాడు ఎన్టీఆర్ ఈ దవాఖాన నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు దీనిని పూర్తి చేసి సేవలు అందించేలా క్రషి చేశారన్నారు. దవాఖానకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడితో పోటీ పడి పని చేసే అవకాశం తనకు వచ్చిందని పేర్కొన్నారు. ఒకప్పుడు



12 గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడిని.. కానీ ఏపీ ముఖ్యమంత్రి 18 గంటలు పని చేసే వ్యక్తి, కాబట్టి తనతో సహా రాష్ట్రంలోని అధికారులంతా అంతే దీటుగా 18 గంటలు పని చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలన్నారు. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్ ను మిగతా 2 లో..

# హర్యానాపై... కమలం గురి

- లోక్‌సభ ఎన్నికల్లో సగానికి తగ్గిన సీట్లు
- ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లోనూ నిరాశాజనకంగా ఫలితాలు
- రిజర్వేషన్ల తొలగింపు ప్రచారం, ఈ గవర్నెన్స్ అమలుతో దూరమైన దళితులు
- ఈ ఏడాది చివర్లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ లో అసెంబ్లీ ఎలక్షన్లు
- సింగిల్ మెజార్టీతో అధికారంలోకి రావాలని ప్రణాళికలు
- లోటుపాట్లను బేరీజు వేసుకుంటున్న బీజేపీ
- రాష్ట్రానికి తదుపరి అధ్యక్షుడిగా జాట్ నేతనే ఎంచుకునే అవకాశం

2



# పదేండ్లు జైలు శిక్ష రూ.కోటి జరిమానా



- పరీక్ష పేపర్ల లీకేజీ బాధ్యులపై చట్టపరంగా చర్యలు
- 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్-2024'ను ప్రకటించిన కేంద్రం
- జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ
- కేంద్రానికి దర్యాప్తును ఏదైనా ఏజెన్సీకి అప్పగించే అధికారం

**న్యూఢిల్లీ, జూన్ 22 :** వరుస పేపర్ లీకులతో సతమతవుతున్న కేంద్రం ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది. పేపరు లీకేజీలకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు యుద్ధప్రాతిపదికన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్)యాక్ట్-2024'ను అమల్లోకి తీసుకొచ్చింది. జూన్ 21 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తోందని, త్వరలో నోటిఫై చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ జూన్ 20న ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసే వారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్ వర్క్ ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహించినా, నకిలీ ప్రవేశపరీక్ష కార్డులు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. పేపరు లీక్ చేసేవాళ్లకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే వెసులుబాటు ఉంది. ఇందులో భాగస్వాములు మిగతా 2 లో..

# నీట్ హీట్..

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇల్లు ముట్టడించిన విద్యార్థి సంఘాలు
- అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు
- ఓయూ లైబ్రరీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థుల దీక్ష
- మోదీ స్పందించకుంటే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

2




కిషన్ రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

# ఏపీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

**ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటన**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు**



స్పీకర్ గా ఎన్నికైన అయ్యన్న పాత్రుడిని అభినందిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

# ఆ వీడియో.. ఫేక్



- పాపులర్ అయ్యేందుకు ఇలా చేయడం పద్ధతి కాదు
- ఆర్టీసీ ప్రతిష్టను దిగజార్చొద్దు
- బస్సు చక్రాల కింద పడుకున్నట్లు సోషల్ మీడియో వీడియోపై స్పందించిన ఎండీ సజ్జనార్

5

# తప్పిన ప్రమాదం

**ఏపీ మాజీ సీఎం జగన్ కాన్వాయ్ వాహనాన్ని ఢీ కొన్న ఫైర్ఇంజిన్**

**కడప విమానాశ్రయం నుంచి పులివెందుల వెళ్తుండగా ఘటన**

**ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్న సిబ్బంది**

6



# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

**నచ్చినంత స్థలం తీసుకోవచ్చంటూ ఓ వీడియో వైరల్**

**పెద్దఎత్తున తరలివచ్చిన జనం**

**అడ్డుకోబోయిన పోలీసులపై రాళ్లతో దాడి..**

**హైదరాబాద్ మియాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి**

2

# హర్యానాపై కమలం గురి

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సగానికి తగ్గిన సీట్లు
- ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ లోనూ నిరాశాజనకంగా ఫలితాలు
- ఈ ఏడాది చివర్లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ లో అసెంబ్లీ ఎలక్షన్లు
- సింగిల్ మెజార్టీతో అధికారంలోకి రావాలని ప్రణాళికలు



**ఛండీఘడ్, జూన్ 22 :** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాష్ట్రాలపై భారతీయ జనతా పార్టీ దృష్టి సారించింది. ఆ రాష్ట్రాల్లో పార్టీ స్థితిగతులు, లోటుపాట్లపై ఆత్మపరిశీలన చేస్తోంది. తమకు ఎదురేలేదు అనుకున్న హిందీ హార్ట్ ల్యాండ్ లోనే కమలదళానికి ఎదురుదెబ్బలు తగిలాయి. ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక బీజేపీ చతికిలపడింది. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలతో పాటు హర్యానాలోనూ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే లోపాలు, పొరపాట్లు గుర్తించి సరిదిద్దకపోతే.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. అందుకే కమలదళం పెద్దలు ఆయా రాష్ట్రాల్లో స్థితిగతులపై అధ్యయనం, మేధోమధనం ప్రారంభించారు.

మొత్తం 10 లోక్ సభ స్థానాలున్న హర్యానా రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెరో 5 సీట్లు గెలుపొందాయి. 2019లో సాధించిన సంఖ్యతో పోల్చితే ఈ రాష్ట్రంలో బీజేపీ బలం సగానికి సగం తగ్గిపోయింది. అప్పుడు ఏకంగా 58.02% ఓట్లతో రాష్ట్రంలోని అన్ని స్థానాలను బీజేపీ క్లీన్ స్వీప్ చేయగా, కాంగ్రెస్ పార్టీ కేవలం 28.42% ఓట్లతో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. కానీ ఈసారి బీజేపీ 46.11% ఓట్లు, కాంగ్రెస్ 43.67% ఓట్లు సాధించి చెరో 5 స్థానాలు గెలుపొందాయి. గణాంకాలను పరిశీలిస్తే కాంగ్రెస్ ఏకంగా 15.25% మేర తమ బలాన్ని పెంచుకోగలిగింది. ఇదే సమయంలో బీజేపీ 11.91% ఓట్లను కోల్పోయింది. ఇది కమలనాథులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం. హర్యానాలో బీజేపీ పనితీరుపై కొద్ది రోజుల క్రితం కోర్ గ్రూప్ సమావేశం జరిగింది. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కొత్తగా ఎన్నికల ఇన్ చార్జి, కో-ఇన్ చార్జులుగా నియమితులైన ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ కుమార్ దేవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హర్యానా బీజేపీ కోర్ గ్రూప్ నేతలైన హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి), కృష్ణపాల్ గుర్జార్, కెప్టెన్ అభిమన్యు, సుధా యాదవ్, హర్యానా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ ఫణీంద్రనాథ్ శర్మ, సంజయ్ భాటియా, ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్ సతీష్ పునియా, కో-ఇన్ చార్జ్ సురేంద్ర నాగర్ తదితరులు ఈ కీలక భేటీలో పాల్గొని లోటుపాట్లపై లోతుగా చర్చించారు. ముఖ్యంగా అంబాలా, సోనిపథ్ వంటి స్థానాల్లో ఓటమి వారిని కలవరపెట్టింది. అంబాలా బీజేపీకి వరుసగా విజయాలు అందిస్తున్న స్థానం. ఇంకా చెప్పాలంటే రాష్ట్రం మొత్తం మీద సురక్షితమైన స్థానంగా బీజేపీ నేతలు భావిస్తారు. అలాంటి చోట ఓటమికి దారితీసిన పరిస్థితులేంటి అన్నదే అగ్రనాయకత్వాన్ని వేధిస్తున్న ప్రశ్న.

సుదీర్ఘ చర్చ అనంతరం రాష్ట్రంలోని జాట్ సామాజికవర్గం ఓటర్లలో నెలకొన్న ఆగ్రహం, దళితుల్లో నెలకొన్న అసంతృప్తి పార్టీ విజయావకాశాలను దెబ్బతీశాయని అంచనాకు వచ్చారు. జాట్ల ఆగ్రహానికి కారణాలను అన్వేషించి, వారిని ఆకర్షించేందుకు బీజేపీ త్వరలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని చూస్తోంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రానికి తదుపరి పార్టీ అధ్యక్షుడిగా జాట్ నేతనే ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. మొత్తం పరిస్థితులను ఆకళింపు చేసుకోడానికి హర్యానా రాష్ట్ర ఎన్నికల ఇన్ చార్జిగా నియమితులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారు అంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం ప్రభావంతో దళితులు కొంత దూరమయ్యారని కమలనాథులు గ్రహించారు. యూపీ, రాజస్థాన్, మహారాష్ట్ర సహా దేశవ్యాప్తంగా రిజర్వ్ డ్ స్థానాల్లో ఈసారి బీజేపీ దెబ్బతినడానికి ఈ అంశమే ప్రధాన కారణమని భావిస్తున్నారు. హర్యానాలో దళితులు దూరమవడంలో ఈ-గవర్నెన్స్ కూడా ఒక కారణమని తేలింది.

ఆన్‌లైన్ విధానం, యాప్‌ల వాడకం గురించి అంతగా తెలియని వర్గాలు సైతం ఏదైనా ప్రభుత్వ పథకాన్ని పొందాలంటే తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, వెనుకబడిన వర్గాల్లో ఈ చర్య అసంతృప్తికి కారణమైందని కొందరు విశ్లేషిస్తున్నారు. దీన్ని సరిదిద్దేందుకు ఇక నుంచి ఆన్‌లైన్‌తో పాటు పేపర్ మీద దరఖాస్తులు నింపి అందజేసే ప్రక్రియను పునరుద్ధరించాలని నిర్ణయించారు. మొత్తంగా పార్టీకి దూరమైన 12% ఓటర్లను మళ్లీ తిరిగి తమ వద్దకు తెచ్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబరు నెలలో హర్యానాలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఈ రాష్ట్రానికి పార్టీ ఎన్నికల ఇన్ చార్జ్‌గా, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ ను కో-ఇన్ చార్జ్‌గా నియమించింది. ఇద్దరికీ లోటుపాట్లను గుర్తించి సరిదిద్దే కీలకమైన బాధ్యతలు అప్పగించింది.

# రోజుకు 2.14 లక్షల మందికి అన్నదానం

- రోజు ఖర్చు రూ.38లక్షలు
- నాణ్యతలో రాజీ పడొద్దు
- వంటశాలను శుభ్రంగా ఉంచాలి
- టీటీడీ ఈవో శ్యామల రావు



**తిరుమల, జూన్ 22, (ప్రజాస్వరం):** తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్రీ జె శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగం కార్యకలాపాలను ఈవో రివ్యూ చేశారు. టీటీడీలోని ప్రతి విభాగం పని తీరుపై తెలుసుకోవడంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో జేఈవోలు గౌతమి, శ్రీ వీరబ్రహ్మంలతో కలిసి అన్నప్రసాద విభాగాన్ని సంబంధిత అధికారులతో కలసి ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్ (ఎంటీవీఏసీ), విక్యూసీలోని అక్షయ కిచెన్, పీఏసీ 2తో పాటు, ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథి గృహం సహా తిరుమలలో అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలను ఆయన సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని అన్నప్రసాదం, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

తిరుమల, తిరుపతిలతో కలిపి రోజుకు సగటున 1.92 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. వీరిలో తిరుమలలో అన్నం తినేవారి సంఖ్య దాదాపు 1.75లక్షలు కాగా, తిరుపతిలో 17వేలు మందిగా ఉంది. వారాంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేలతో కలిపి సుమారు 2.14 లక్షల మందికి అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. కాగా ఒక రోజున అన్నప్రసాదం కోసం అవుతున్న ఖర్చు దాదాపు రూ.38 లక్షలుగా ఉంది. కాగా భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే స్థలంలో ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని అధికారులకు ఈఓ సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. తిరుపతిలో అన్న ప్రసాదం నాణ్యత పై గతంలో చాలా రకాల విమర్శలు ఉన్నాయి. ఇది ఎప్పటికప్పుడు వెలుగు చూసాయి కూడా. ముఖ్యంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో నాణ్యత పై భక్తులే నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అన్న ప్రసాదం నాణ్యత పై ఎప్పటికప్పుడు టీటీడీ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. టీటీడీ డైలీ ఈవో, సోషల్ మీడియా వేదికగా కొందరు ఇదే విషయమై తరచూ ప్రస్తావించేవారు. కళ్లకు అద్దుకుని శ్రీవారే అందించినది గా భావించే అన్న ప్రసాదం అధ్వానంగా మారడంతో టీటీడీ చరిత్ర మసకబారింది. అయితే ఈ విషయంలో వైసీపీ నేతలు పెద్దగా పట్టించుకోకపోవడంతో భక్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ముందుగా తిరుపతి నుంచి ప్రక్షాళన ప్రారంభించారు. సంవత్సరాలుగా టీటీడీ ఇంచార్జ్ ఈవోగా పాతుకు పోయిన ధర్మారెడ్డిని తప్పించారు. సిన్సియర్ అధికారిగా గుర్తింపు పొందిన శ్యామల రావును నియమించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుంచి అన్న ప్రసాద నాణ్యత పై దృష్టి పెట్టారు. దీంతో భక్తులకు నాణ్యతతో కూడిన అన్న ప్రసాదం అందుతోంది.

టీడీపీ ప్రభుత్వాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్నప్రసాద నాణ్యతను పెద్ద పీట వేసేవి. 1985లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతిలో అన్నప్రసాదశాలలు ఏర్పాటు చేశారు. అవి క్రమేపి విస్తరిస్తూ వచ్చాయి. భక్తుల కడుపు నింపేందుకు ప్రయత్నించేవి.మొత్తానికైతే టీడీపీ అధికారంలోకి వచ్చింది. తిరుమలలో భక్తులకు నాణ్యమైన అన్న ప్రసాదం అందుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తిరుమల, తిరుపతిలలో పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచడం, దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం, అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్ ను నియమించడం వంటి అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా అమలు చేసేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు రావాలని అధికారులను ఈఓ ఆదేశించారు.

## తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలువాలి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని ఈ సందర్భంగా వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుందని చెప్పారు. ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు కచ్చితంగా ఉంటుందని భరోసా కల్పించారు. వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్ కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతామన్నారు. రాజకీయం, సంక్షేమం ఈ రెండింటిని ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారని కీర్తించారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నందమూరి బాలకృష్ణ తనను 25వ వార్షికోత్సవానికి రావాలని కోరుతున్నారు.. 30వ వార్షికోత్సవానికి కూడా నేనే వస్తానని సీఎం రేవంత్ చెప్పారు. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినెట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించామన్నారు. మూడోతరం అయిన లోకేష్ బాబు, భరత్ రాజకీయాల్లో, సంక్షేమంలో ఎలాంటి మార్క్ కనబరుస్తారో చూడాలని సీఎం రేవంత్ తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జాపికను అందజేస్తున్న హీరో బాలకష్ణ

## గనుల వేలంపై చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని పేర్కొన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టును కేంద్రం ప్రభుత్వం రద్దు చేసిందని, అయితే గతంలో కాంగ్రెస్ ప్రతిపాదనలు ఎంత మేర పూర్తిచేశామో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నీట్ అవకతవకలపై విపక్షాలవి దుష్ప్రచారాలని, కావాలనే ఈ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నాయని రఘునందన్ రావు ధ్వజమెత్తారు. పేపర్ లీక్ అంశం వాస్తవ దూరమైన విషయమని, ప్రతిపక్షాలు కేంద్రంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ అంశం కోర్టులో ఉన్నందున ఎక్కువగా మాట్లాడలేనంటూ వ్యాఖ్యానించారు. పెండింగ్ లో ఉన్న మల్లన్నసాగర్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని, గతంలో మెదక్ కలెక్టర్ దృష్టికి సమస్యలు తెచ్చినా పరిష్కరించలేదని ఆరోపించారు. బీజేపీ నేతల పోరాటంతో రైతులకు రూ.13 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు పరిహారం వచ్చేలా చేసినట్లు తెలిపారు. కలెక్టర్ గా పనిచేసి ఆ తరవాత ప్రజాప్రతినిధిగా మారిన వెంకట్ రాంరెడ్డి ఒక గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసుకుని ధరణి స్లాట్స్ బ్లాక్ చేసి అనేక ఎకరాల భూమిని తన అధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు. ములుగు మండలం క్షీరసాగర్ లో 80 ఎకరాల భూమిని ఈవిధంగానే చేశారని, ఇక్కడి నుంచే భూసేకరణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను బీజేపీ అమలు చేస్తూ వస్తున్నట్లు తెలిపారు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయిన తరువాత మరోలా మాట్లాడటం పరిపాటిగా మారిందని ఎంపీ రఘునందన్ తెలిపారు. కోల్ మైనింగ్ సంబంధించి పార్లమెంట్ లో చేసిన చట్టానికి బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలానికి సంబంధించి కేంద్రం వాటా 49 శాతం అని, తెలంగాణ ప్రభుత్వ వాటాయే ఎక్కువని పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలంపై కాంగ్రెస్ నేతలతో బహిరంగ చర్చకు సిద్ధమని రఘునందన్ రావు వెల్లడించారు.

## పదేండ్లు జైలు శిక్ష రూ.కోటి జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్లు రుజువైతే.. వారి ఆస్తులనూ జప్తు చేస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునూ వారినుంచే వసూలు చేస్తారు. ఈ కొత్త చట్టం ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్ సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ తదితర పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు సైతం చట్టం వర్తించనుంది. పేపర్ లీక్ కేసుల్లో దోషులుగా తేలే వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. అయితే పేపర్ లీక్ వ్యవహారాల్లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వారికి ఐదు నుంచి పదేళ్ల జైలుశిక్ష విధించాలని బిల్లులో పెట్టారు. విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే కాబట్టి.. ఇలాంటి నేరాలు చేసే వారికి భవిష్యత్ లేకుండా చేసేలా శిక్షలు ఉంటాయి. పరీక్షల నిర్వహణ బాధ్యతలను చేపట్టే సర్వీస్ ప్రొవైడర్ సంస్థలు పేపర్ లీక్ చేసినట్లు తేలితే వాటికి రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునంతా సంస్థ నుంచి రికవర్ చేయాలనే ప్రతిపాదనను కూడా ఈ బిల్లులో పొందుపరిచారు. ఇలాంటి సంస్థపై పరీక్షలు నిర్వహించకుండా నాలుగేళ్ల పాటు బ్యాన్‌ను కూడా విధిస్తారు. పేపర్ లీక్ కేసుల విచారణను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ స్థాయి కంటే తక్కువ లేని అధికారి నిర్వహించాల్సి ఉంటుంది. దర్యాప్తును ఏదైనా కేంద్ర ఏజెన్సీకి అప్పగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఈ బిల్లులో పేపర్ లీక్‌తో ముడిపడిన 20 రకాల నేరాలు, అక్రమాలకు పాల్పడే వారికి విధించాల్సిన శిక్షల గురించి ప్రస్తావించారు. మాస్ కాపీయింగ్, జవాబు పత్రాలను తారుమారు చేయడం, ఓఎంఆర్ షీట్లను ట్యాంపరింగ్ చేయడం వంటివన్నీ ఈ నేరాల జాబితాలో ఉన్నాయి.

# నీట్ హీట్..

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇల్లు ముట్టడించిన విద్యార్థి సంఘాలు... అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు
- ఓయూ లైబ్రరీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థుల దీక్ష
- మోదీ స్పందించకుంటే మరిన్ని ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్ జూన్ 22, (ప్రజాస్వరం):** నీట్ పేపర్ లీకేజిని నిరసిస్తూ బర్కత్ పుర లోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు విద్యార్థి సంఘాలు ప్రయత్నించాయి. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు.తరువాత అదుపులోకి తీసుకున్నారు.ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త నెలకొంది.

ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో చనగాని దయాకర్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో నీట్ పరీక్ష రద్దు కోసం విద్యార్దుల దీక్ష చేపట్టారు. '24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో మోదీ ప్రభుత్వం ఆడుకుంటున్నారు. నీట్ స్కామ్ పై సీబీఐ విచారణ జరపాలి. ఎన్టీఏ జనరల్ డైరెక్టర్ శుభోద్ కుమార్ సింగ్ ను వెంటనే అరెస్ట్ చేయాలి' అని డిమాండ్ చేశారు..24 గంటలో మోదీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

### హైదరాబాద్ మియాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి

**హైదరాబాద్ జూన్ 22, (ప్రజాస్వరం) :** మియాపూర్ లోని హెచ్ఎంటీ రోడ్డు వద్ద ఉన్న హెచ్ఎండీఏ ప్రభుత్వ భూమిలో ఉన్న భూమిని ఎవరికి నచ్చినట్లు వారు తీసుకోవచ్చు అని వీడియో వైరల్ కావడంతో దాదాపు 2000 మందికి పైగా వచ్చి కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినప్పటికీ వినకపోగా అక్కడున్న వారంతా పోలీసుల మీద రాళ్ళ దాడి చేశారు. దీంతో చేసేదేమీ లేక పోలీసులు స్థలం వదిలేసి పారిపోయారు. అయితే, ప్రస్తుతం మియాపూర్లో పరిస్థితి అదుపులోనే ఉందని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు.




స్థలం కోసం పెద్ద ఎత్తున వస్తున్న ప్రజలు

# ఢిల్లీలో పరుగులు పెడుతున్న ఏపీ ఫైల్స్



**విజయవాడ, జూన్ 22 :** ఏపీలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతిలో అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి గురువారం ఆయన అమరావతిలో పర్యటించారు. ప్రజావేదిక కూల్చేసిన చోటు నుంచి ఆయన పర్యటన ప్రారంభం కాగా.. అక్కడి శిథిలాలు, నిర్మాణం కాని అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించారు. ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతం వద్ద సీఎం చంద్రబాబు మోకాళ్లపై కూర్చుని సాష్టాంగ నమస్కారం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అమరావతికి గుడ్ న్యూస్ చెప్పింది. అక్కడి కొత్త రైల్వే లైన్ కు క్లియరెన్సులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు రైల్వే శాఖ.. అమరావతి రైల్వే లైన్ భూ సేకరణకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. గతంలో రాష్ట్రం వాటా ఇవ్వాలి.. భూ సేకరణ వ్యయం భరించాలి అనే షరతులతో కాలయాపన చేసిన రైల్వే శాఖ.. ఇప్పుడు అవేమీ లేకుండానే పూర్తిగా తమ నిధులతోనే రైల్వే లైన్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ప్రధానంగా ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు మధ్య భూ సేకరణకు ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించిన కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. విజయవాడ, గుంటూరు రైల్వే లైన్లతో ఏపీ రాజధాని అమరావతి కనెక్టవిటీ కోసం.. కొత్త రైల్వే లైన్ 2017 – 18లో మంజూరైంది. ప్రధానంగా ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు మధ్య 56.53 కిలో మీటర్ల మేర డబుల్ లైన్.. అలాగే అమరావతి – పెదకూరపాడు మధ్య 24.5 కి.మీ సింగిల్ లైన్ కు కసరత్తు చేస్తున్నారు. అలాగే, సత్తెనపల్లి – నరసరావుపేట మధ్య 25 కి.మీల సింగిల్ లైన్ ను కూడా కలిపితే మొత్తం 106 కి.మీ మేర కొత్త లైన్ కు ఆమోదం తెలిపారు. అయితే, గత ఐదేళ్లలో ఈ రైల్వే లైన్లలో ఎలాంటి ముందడుగు పడలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది.ప్రధానంగా ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు మధ్య 56.53 కి.మీ మేర డబుల్ లైన్ నిర్మాణం చేయాలని భావించారు. దానికి బదులు మొదట సింగిల్ లైన్ నిర్మాణానికి సిద్ధమైంది. ఈ లైన్ కు గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఖమ్మం జిల్లాల పరిధిలోని 450 హెక్టార్ల మేర భూసేకరణ చేయబోతున్నారు. ఈ లైన్ నిర్మాణానికి, భూ సేకరణకు రూ.2,600 కోట్లు ఖర్చవుతుందని రైల్వే శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ కొత్త రైల్వే లైన్ విజయవాడ – హైదరాబాద్ లైన్ లో ఎర్రుపాలెం దగ్గర మొదలై.. అమరావతి మీదుగా గుంటూరు, విజయవాడ లైన్ లోని నంబూరు దగ్గర కలుస్తుంది. అటు, ఎర్రుపాలెం తర్వాత 9 కొత్త స్టేషన్లను.. పెద్దాపురం, చిన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరుల్లో నిర్మిస్తారు. వీటిల్లో అమరావతి, కొప్పురావూరు, పెద్దాపురం, పరిటాల పెద్ద స్టేషన్లుగా ఉండనున్నాయి. ఈ రైల్వే లైన్ లో భాగంగానే కృష్ణా నదిపై కొత్తపేట – వడ్డమాను మధ్య 3 కి.మీ మేర వంతెన కూడా నిర్మించనున్నారు.

# మహిపాల్ రెడ్డి రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు

### ఈడీ సంచలన ప్రకటన

**హైదరాబాద్, జూన్ 22, (ప్రజాస్వరం) :** పటాన్ చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇళ్లు, ఆస్తులపై సోదాలు చేసిన ఈడీ సంచలన ప్రకటన చేసింది. మైనింగ్ పేరుతో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. మైనింగ్ వ్యవహారంలో వీరి ద్వారా రూ.39 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం చేకూరినట్లు అధికారులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడి ఇల్లు, ఆఫీసులపై ఈడీ గత రెండు రోజులుగా సోదాలు చేపట్టింది. మనీ లాండరింగ్, హవాలా అనుమానాలతో ఈడీ ఆకస్మిక సోదాలు చేసింది. రియల్ ఎస్టేట్ లో ఈ డబ్బు పెట్టారని గుర్తించిన ఈడీ సోదాలు పూర్తయ్యాక దీనిపై ఓ ప్రకటన చేసింది.మహిపాల్ రెడ్డి మైనింగ్ పేరుతో భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని, దాని విలువ దాదాపు రూ. 300 కోట్ల మేర ఉంటుందని ఈడీ భావిస్తోంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరులు చేసిన చర్యల కారణంగా ప్రభుత్వానికి రూ. 39 కోట్లు నష్టం వాటిల్లిందని ఈడీ పేర్కొంది. అక్రమంగా సంపాదించిన డబ్బును ఆపై రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేశారని.. కొంత డబ్బు బ్యాంక్ అకౌంట్లలో ట్రాన్స్ క్షన్ చేసినట్లు గుర్తించామని ఓ ప్రకటనలో ఈడీ అధికారులు ప్రకటించారు. తాము చేపట్టిన సోదాలతో రూ.19 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బినామీల పేర్ల మీద ట్రాన్సాక్షన్స్ జరిపారని, కొన్ని బ్యాంక్ లాకర్స్‌ని తెరిచి పూర్తి స్థాయిలో లెక్క కట్టాల్సి ఉందన్నారు.

# వడివడిగా విమానాశ్రయం పనులు

**విజయనగరం, జూన్ 22, (ప్రజాస్వరం) :** భోగాపురం విమానాశ్రయం పనులు వేగం పుంజుకున్నాయి. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా అంశం. త్వరితగతిన ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తి చేసి విమానాలను రన్ వే పై దూసుకుపోయేలా చర్యలు చేపట్టాలని ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. అందుకోసం నిరంతరం పర్యవేక్షిస్తుంది ఏపీ ఎడీసీఎల్. ఉత్తరాంధ్ర నడిబొడ్డున ఉన్న భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఆంధ్రప్రదేశ్ కే తలమానికం. ఇటు విశాఖ, అటు శ్రీకాకుళం జిల్లాకు మధ్యలో ఉన్న ఈ ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే ప్రయాణికుల సౌకర్యంతో పాటు కార్గో కూడా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీకి కేటాయించిన కీలక ప్రాజెక్ట్స్ లో ముఖ్యమైన ప్రాజెక్ట్ భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్.. అలా కేటాయించిన ప్రాజెక్ట్ మూడు జిల్లాలకు అందుబాటులో ఉండేలా చేయాలని అనేక రకాల అధ్యయనాలు చేసింది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం. అన్నివిధాలా పరిశీలించిన తరువాత విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు సమీపంలో విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మించాలని నిర్ణయించింది. 2016లో స్థలం గుర్తించి, ఎయిర్ పోర్ట్ కు నోటిఫికేషన్ ఇచ్చింది ప్రభుత్వం. ఆ తరువాత అనేక అడ్డంకులతో భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులను ప్రఖ్యాతి గాంచిన జీఎమ్ ఆర్ సంస్థకి అప్పగించింది అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు ఇవ్వడంతో సుమారు 4,750 కోట్ల వ్యయంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది జీఎంఆర్ సంస్థ. 2023 ఫిబ్రవరి 3న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించింది జి ఎమ్ ఆర్ సంస్థ. కేవలం మూడేళ్లలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఎయిర్ పోర్ట్ నిర్మాణ సంస్థ ప్రారంభించింది. అలా పనులు ప్రారంభం అయిన నత్తనడకన సాగుతుండటంతో పాటు ఎయిర్ పోర్ట్ కు అనుసంధాన సీడ్ యాక్సిస్ రోడ్ల తో పాటు చాలా పనులు ఇంకా ప్రారంభమే కాలేదు.పనులు ఎప్పటికి పూర్తవుతాయో అన్న సందేహం అందరిలో నెలకొంది. అయితే ప్రస్తుతం అదే ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం ఎంపి అయిన రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన మంత్రి కావడంతో కొత్త ఆశలు చిగురించాయి. ఎయిర్ పోర్ట్ పనులు పరుగులు తీయిస్తా, నిర్ణీత సమయంలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను పూర్తిచేస్తామని చెప్పడంతో ఉత్తరాంధ్ర వాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే మరో రెండేళ్లలో ఎయిర్ పోర్ట్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో సేవలు కూడా గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం కావటంతో ఇక్కడి నుంచి ఇతర దేశాలకు సైతం రాకపోకలు జరగనున్నాయి.. అంతే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావడంతో పాటు పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి వెనుకబడిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలు అభివృద్ధి పథం వైపు దూసుకుపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# రుషికొండ రహస్యాలపై అనుమానాలు


**విశాఖపట్టణం, జూన్ 22 (ప్రజాస్వరం) :**



విశాఖ పర్యాటక కేంద్రం. రుషికొండ అందాలు చూసేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2019లో వైసీసీ అధికారంలోకి వచ్చే ముందు వరకు రుషికొండపై హరిత రిసార్ట్స్ ఉండేవి. పాత గదులు 34, కొత్త గదులు 24 కలిపి మొత్తం 58 గదులు ఉండేవి. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకుని అక్కడ బస చేసే వారు. రెస్టారెంట్, సమావేశ మందిరాలు ఉండేవి. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు వచ్చినట్టే.. రుషికొండకు కూడా పర్యాటకులు స్వేచ్ఛగా వచ్చి వెళ్లిపోయే వారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్ల తర్వాత పరిస్థితులు మారిపోయాయి.మూడు రాజధానుల అంశం, విశాఖ పరిపారాలనా రాజధాని అన్న విషయం తెరపైకి వచ్చిన కొన్ని రోజులకే రుషికొండ నిషిద్ధ ప్రాంతంగా మారిపోయింది. పర్యాటకులే కాదు.. స్థానికులు కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ముందుగా 20 అడుగుల ప్రహరీ గోడ పైకి లేచింది. తర్వాత ఆ పరిసర ప్రాంతాల్లోకి ఎవరినీ వెళ్లనివ్వలేదు. అక్కడ ఏదో జరుగుతోందని తెలుసు కానీ.. ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు. రుషికొండ రహస్యం నిగ్గు తేల్చేందుకు అప్పటి ప్రతిపక్షనేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పవన్‌కల్యాణ్‌ను విశాఖ దాటి వెళ్లనివ్వలేదు. లోకేశ్, కమ్యూనిస్టు నేతలు ఇలా ఎవరూ రుషికొండ దరిదాపుల్లోకి కూడా వెళ్లలేకపోయారునేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా కొండను తొలచి నిర్మాణాలు చేపడుతున్నారని%ొ% దీనివల్ల మొత్తం రుషికొండకే ప్రమాదం ఏర్పడుతుందని ప్రతిపక్షాలు, పర్యావరణ వేత్తల తరఫున న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. పర్యాటక భవనం పేరుతో దరఖాస్తులు చేసుకుని మరేవో నిర్మాణాలు చేపట్టారన్న మూకుమ్మడి ఆరోపణలు వినిపించాయి. గండికోట రహస్యం తరహాలో%ొ% ఇలా నాలుగేళ్లపాటు రుషికొండ రహస్యం సాగింది. ఇంకొన్నేళ్లూ ఆ రహస్యం అలాగే ఉండేదేమో కానీ%ొ%ఇంతలో ఎన్నికలొచ్చి ప్రభుత్వం మారిపోయింది.భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు%ొ% మరికొందరిని తీసుకుని రుషికొండ రాజప్రాసాదంలో అడుగుపెట్టడంతో అసలు కథ బయటికొచ్చింది. నాలుగేళ్లపాటు సాధారణ జనం మొదలుకుని, రాజకీయ నేతల దాకా ఎవరినీ రుషికొండ వైపు కన్నెత్తి చూడనీకుండా అప్పటి ప్రభుత్వం ఎందుకు అడ్డుకుందో.. రుషికొండకు సంబంధించిన వ్యవహారాల న్నింటినీ రహస్యంగా ఉంచడానికి కారణ మేంటో%ొ%రుషికొండను తొలచి ఏం చేశారో అందరికీ తెలిసిపోయింది.కొండ చుట్టూ ఏడు సూపర్ స్ట్రక్చర్స్, సీ వ్యూ క్యాప్చర్.. ఆ భవనాల లోపల విదేశాల నుంచి తెప్పించిన ఇంటీరియర్ ఫర్నీచర్, యూరప్ నుంచి తెప్పించిన గ్రానైట్, ప్రత్యేక డిజైన్ మార్బుల్, బయోమెట్రిక్‌తో పనిచేసే వార్డ్‌రోబ్స్, 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో బాత్‌రూమ్‌లు, ఎటువైపు నుంచి చూసినా సముద్రం కనిపించేలా డిజైన్, గోడలపై పాలరాయి తాపడాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, విదేశాల నుంచి తెప్పించిన మంచం, పరుపు, కుర్చీలు, బల్లలు, భవనాల బయట విదేశాల నుంచి తీసుకొచ్చిన వేల మొక్కలతో ఏర్పాటు చేసిన గార్డెన్, ఆ గార్డెన్‌లో 20 కోట్ల ఖర్చుతో చేసిన విద్యుత్ అలంకరణలు, రెండున్నర లక్షలతో ఏర్పాటైన్ ఒక్కో విద్యుత్ దీపం%ొ%. ఇలా రుషికొండపై ఉన్న నిర్మాణాల ధగధగలు గురించి ఎంత చెప్పినా తక్కువే.ఈ ఏడు బ్లాకుల్లో ఓ భవనంలోని బాత్ టబ్, స్పా, బంగారం రంగులో ఉన్న కమోడ్ గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. జగన్ తన కోసం, తన కుటుంబం కోసం నిర్మించుకున్నారని టీడీపీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ఓ భవనంలో ఇవి ఉన్నాయి. బాత్ టబ్ ఖరీదు 26 లక్షలని, బంగారం రంగులో ఉన్న కమోడ్ ధర 15 లక్షలని ప్రభుత్వం అంటోంది.హరిత రిసార్ట్స్ ఆధ్వర్యంలో నడిచే రూమ్‌లను అధునాతనంగా తీర్చిదిద్దడంతో పాటు కొండపై కొత్త భవనాలు నిర్మించారు. కొత్త నిర్మాణాల్లో నిబంధనలు పాటించలేదని టీడీపీ ఆరోపిస్తోంది. పాత భవనాల ఆధునికీకరణ, కొత్త భవనాల నిర్మాణానికి 500 కోట్లు ఖర్చు పెట్టారని ప్రచారం జరుగుతోంది. మొత్తం 9.88 ఎకరాల్లో విజయనగర, కళింగ, వేంగి, గజపతి బ్లాకులుగా భవనాల నిర్మాణం జరిగింది. విజయనగర బ్లాకునే మూడుగా విభజించారు. వాటికి చోళ, పల్లవి, తూర్పు కనుమలుగా పేర్లు పెట్టారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఈ ఆధునికీకరణ కార్యక్రమాలు సాగాయి. రిసార్టులను ఆధునికీకరించే పనులు మొదలుపెట్టిన దగ్గర నుంచి అసలక్కడ ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు.గంటా శ్రీనివాసరావు ఆ భవనాల వీడియోలు విడుదల చేసేవరకు.. ఆంధ్రప్రదేశ్‌లో అంత విలాస భవనాలు ఉన్న విషయమే బయటకు రాలేదు. 400మందితో సమావేశం జరుపుకోగల మీటింగ్ రూం, 100 మందితో సమావేశాలకు సరిపోయే నాలుగు రూమ్స్ ఉన్నాయి. ఏడు బ్లాకులుగా ఉన్న మూడు భవనాలు అత్యాధునిక హంగులతో ఉన్నాయి. ఖరీదైన ఫర్నీచర్, షాండ్లియర్లు, బంగార రంగు షవర్లు, కుళాయిలు, టీవీలు, అధునాతన డిజైన్లలో ఫ్యాన్లు, బిగ్‌స్క్రీన్‌లు, ఖరీదైన కుర్చీలు, విలాసవంతమైన పడకగదులు ఇలా రుషికొండ రాజభవనాల ప్రత్యేకతల గురించి, ఆ స్థాయిలో ఆ భవనాలను తీర్చిదిద్దడానికి అయిన ఖర్చు గురించి ఎంత చెప్పినా తక్కువే.రుషికొండ ప్యాలెస్‌లో వాడిన ఇటాలియన్ మార్బుల్, టైల్స్ చూస్తే దిమ్మ తిరుగుతుందని, ఈ ఇటాలియన్ మార్బుల్ కోసం ఒక్కో అడుగుకు పెట్టిన ఖర్చుతో మధ్యతరగతి ప్రజలు చిన్న సైజు అపార్ట్‌మెంట్ కొనేయొచ్చని టీడీపీ ఆరోపిస్తోంది. ఆ ఆరోపణల సంగతి పక్కన పెడితే విభజన బాధిత రాష్ట్రంగా, రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయిన ఆంధ్రప్రదేశ్.. రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి పెద్దల కోసం, పర్యాటకుల కోసం ఈ స్థాయిలో ఖర్చు పెట్టి భవనాలు నిర్మించే స్థితిలో ఉండడమే అసలైన విచిత్రం.

# కదులుతున్న నీట్ డొంక

**పాట్నా, జూన్ 22 (ప్రజాస్వరం) :**




నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ 2024 పరీక్షలో అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలను గతవారం కేంద్ర విద్యాశాక, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తోసిపుచ్చింది. లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని ఆరోపణలు కొట్టిపారేసింది. ప్రతి పక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించాయి. అయితే, పేపర్ లీక్ నిజమేనని ఆధారాలతో సహా బయటికొచ్చింది. పరీక్ష ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం జవాబులతో సహా తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన నలుగురు పోలీసులకు వెల్లడించారు.

ఈ వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం లేపుతోంది.బీహార్‌లో అరెస్టయిన నలుగురు విద్యార్థుల్లో అభిలాషి అనురాగ్ యాదవ్, అతని మామ దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సికందర్‌తో పాటు మరో ఇద్దరు విద్యార్థులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారు. కోటాలోని కోచింగ్ హబ్‌లో పరీక్షకు సిద్ధమవుతున్న అనురాగ్ యాదవ్‌కు అతని మామ సికందర్ ఫోన్ చేసి పేపర్ లీక్ చేసేందుకు ప్లాన్ చేశానని, వెంటనే ఇంటికి రావాలని కోరాడు. వెంటనే మామవద్దకు చేరుకున్న అనురాగ్ యాదవ్ రాత్రికి రాత్రే జవాబులను చదివి కంఠస్థం చేశాడు. మరుసటి రోజు పరీక్ష కేంద్రానికి వెళ్లిన అనురాగ్ యాదవ్‌కు సరిగ్గా కంఠస్థం చేసిన ప్రశ్నలే రావడంతో అన్ని సమాధానాలు రాశాడు. అనురాగ్‌తోపాటు అతని స్నేహితులు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్ అనే మరో ఇద్దరు విద్యార్థులకు కూడా సికిందర్ పేపర్ అందించాడు. వీరు నీట్ క్లియర్ చేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.30 నుంచి 32 లక్షల వరకు వసూలు చేసినట్లు నిందితులు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించడంతో పాటు.. ఇదే విషయాన్ని రాత పూర్వకంగా రాసిచ్చారు. దీంతో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మరింత తీవ్రమైంది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 14 మందిని అరెస్టు చేశారు. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది.

# విశాఖ లోనూ వైసిపి కార్యాలయానికి నోటీసులు

**విశాఖపట్నం, జూన్ 22 (ప్రజాస్వరం) :**

విశాఖపట్నంలోని వైకాపా కార్యాలయానికి జీవీఎంసి నోటీసులు జారీ చేసింది. ఎండాడ లోని సర్వే నంబర్ 175/4 లో 2 ఎకరాలలో స్థలం లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేశారని అభ్యంతరం వ్యక్తం చేసింది. జీ వీ ఎం సీ నుంచి కాకుండా అనుమతులు కోసం వీ ఎం ఆర్ డీ ఏ కు దరఖాస్తు చేయడం, అక్కడా అనుమతులు రాకుండానే నిర్మాణాలు పూర్తి చేయడం పై జీవీఎంసి వివరణ కోరింది. వారం లోపు సరైన వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యలు ఉంటాయంటూ వైఎస్ఆర్సీపీ కార్యాలయానికి నోటీసు అంటించారు.

# జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థి గౌతమ్ కృష్ణ తేజకు డాక్టరేట్ ప్రధానం

**ˇ ముద్ర గర్భ పరిస్థితులు, ప్రకృతి విపత్తులు, అగ్నిపర్వతాలపై పరిశోధనలు చేసిన గౌతం**

**దుచ్చేరి యూనివర్సిటీ నుండి అండమాన్‌లో పరిశోధనలు**

**గవర్నర్లు కిరణ్ బేడీ, నరసింహన్ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు నుండి అభినందనలు అందుకున్న గౌతం**

**కరీంనగర్, జూన్ 22 (ప్రజాస్వరం) :**

డిపార్ట్మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధన విద్యార్థి గుండా గౌతం కృష్ణ తేజ కు తెలంగాణ విశ్వవిద్యాలయం డాక్టరేట్( పి హెచ్ డి) ప్రధానం చేసింది. డెహ్రాడూన్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, తెలంగాణ విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయన ఈ పరిశోధన నిర్వహించారు. కరీంనగర్ కోతి రాంపూర్ కు చెందిన గౌతమ్ కృష్ణ తేజ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ పర్యవేక్షణలో జియో డైనమిక్స్ ఆఫ్ బారెన్ ఐలాండ్ వాల్కనిజం, ఇన్సైడ్స్ ఫ్రొమ్ జియో స్పెషల్ టెక్నాలజీ అనే అంశంలో పరిశోధన చేశారు.ఉస్మానియా విశ్వవిద్యాలయ భూగోళశాస్త్ర ప్రొఫెసర్ నగేష్ ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టాను అందజేశారు. డాక్టరేట్ అందుకున్న గౌతమ్ కృష్ణ తేజను తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ సైన్స్ డీన్ ప్రొఫెసర్. ఆరతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ అరుణ, మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు అత్తర్ అలీ డిపార్ట్మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ హెడ్ డాక్టర్ కవితా తురన్, అధ్యాపకులు డాక్టర్ సబిత, డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్ నారాయణ, వివిధ డిపార్ట్మెంట్ల అధ్యాపకులు పరిశోధనా విద్యార్థులు విద్యార్థులు, పాల్గొన్నారు.

# జాడ లేని వాన



**ఒంగోలు, జూన్ 22 (ప్రజాస్వరం) :**

ఏడాది డేంజర్ బెల్స్ మోగినట్లే కనిపిస్తున్నాయి. ఇంతవరకు వాన జాడలేదు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మూడు రోజులు ముందుగానే ప్రవేశించాయి. ఈనెల 2న వాటి రాక ప్రారంభమైంది. గురువారం నాటికి రాష్ట్రమంతటా విస్తరించాయి. కానీ ఉత్తరాంధ్ర పై అధిక పీడన ద్రోణి ప్రభావం చూపడంతో స్తబ్దుగా ఉండిపోయాయి. రాష్ట్రమంతటా నైరుతి వ్యాపించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి భానుడు సెగలు కక్కుతున్నాడు.రాష్ట్రవ్యాప్తంగా ఒకటి రెండు ప్రాంతాలు తప్ప వర్షాలు జాడలేదు. చెప్పుకోదగ్గ వానలు పడడం లేదు. పైగా రాష్ట్ర మంత్రుల నిప్పుల కుంపటిని తలపిస్తోంది. వేడి, ఒక్క పోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఉన్నట్లుగా గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. మరో నాలుగు ఐదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అల్పపీడనం కానీ.. ఆవర్తనం కానీ ఏర్పడితేనే వర్షాలు కురిసి.. వాతావరణం చల్లబడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇంకా నారుమడులు కూడా సిద్ధం కాలేదు.ప్రస్తుతం కర్ణాటక, కేరళ తీరాల మీదుగా ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మాస్టరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. పిడుగులతోపాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని కూడా స్పష్టం చేసింది. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణాజిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

# నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

**ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారిని మోసం చేసే ఏజెంట్ల పై జిల్లా పోలీస్ ప్రత్యేక నజర్**

**ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు**

**ఈ సంవత్సరం జిల్లాలో నకిలి గల్ఫ్ ఏజంట్ల పై 34 కేసులలో 58 మందిపై కేసులు నమోదు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ 22 (ప్రజాస్వరం) :**

జిలాల్లో నకిలి గల్ఫ్ ఏజెంట్ల మోసలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో గతంలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరిగిందని,నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతూ ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని,గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ మేరకు శనివారం రోజున ఒక ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. జిల్లా నుంచి ఉపాది నిమిత్తం గల్ఫ్ వెళ్ళేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలన్నారు. ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారు తమ వైఖరి మార్చుకోకపోతే కఠిన చర్యలు చేపడతాం అని , జిల్లాలో గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితుల ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుండి ఉపాధి కోసం వెళ్ళే వారి వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని, నకిలీ వీసాలు ఇచ్చి ,పాస్ పోర్ట్ లు దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ ఏజెంట్ల పై జిలాల్లో గత సంవత్సరం 34 కేసులలో 38 మందిని అరెస్ట్ చేసి 9 మందిని జైలుకి తరలించడం జరిగిందని, ఈ సంవత్సరం 34 కేసులలో 58 మందిని అరెస్ట్ చేసి ఇద్దరిని జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు. ఉపాధి కోసం గల్ఫ్ వెల్లేవారు నకిలి ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, గల్ఫ్ దేశాలకు వెళ్ళు వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించి, వారి ద్వారానే వీసాలు పొందవలసిందిగా సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకొనుటకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించవచ్చని సూచించారు.

# వైకాపా కార్యాలయాన్ని కూల్చేయడంపై జగన్ ట్వీట్

**తాడేపల్లి, జూన్ 22 (ప్రజాస్వరం) :**

: తాడేపల్లిలో వైకాపా కార్యాలయాన్ని కూల్చేయడంపై వైఎస్ జగన్ స్పందించారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు చంద్రబాబు దిగారు. తన దమనకాండను మరోస్థాయికి తీసుకెళ్లారు. నియంతలా దాదాపు పూర్తికావొచ్చిన వైకాపా కార్యాలయాన్ని కూల్చేయించారు. హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం కనుమరుగైపోయాయి. దేశంలోని ప్రజాస్వామ్య వాదులంతా బాబు దుశ్చర్యలను ఖండించాలి. ఈ బెదిరింపులకు తలొగ్గేది లేదు' అని ట్వీట్ చేశారు.

# ప్రవీణ్ ప్రకాష్ పశ్చాత్తాపం...

విజయవాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :

ప్రవీణ్ ప్రకాష్.. జగన్ అస్మదీయ అధికారి. అత్యంత వీర విధేయుడు. జగన్ ముందు వంగి వంగి నమస్కారాలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. సీనియారిటీ, సిన్సియారిటీ అధికారిగా పేరు తెచ్చుకున్న ఈయన.. గత ఐదేళ్ల వైసిపి పాలనలో మాత్రం ఎన్నెన్నో విమర్శలను మూటగట్టుకున్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ఇబ్బంది పెట్టారన్న అపవాదులు మూటగట్టుకున్నారు. ప్రభుత్వ పెద్దలతో అంటగాకినట్లు ఈయనపై ఆరోపణలు ఉన్నాయి. అందుకే చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఈయనపై వేటు పడింది. సాధారణ పరిపాలన శాఖకు ప్రభుత్వం సరెండర్ చేసింది. అయితే ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు ప్రవీణ్ ప్రకాష్. పాఠశాల విద్యాశాఖలో తాను ఎవరిని అవమానించలేదని.. ఎవరికైనా అలా అనిపిస్తే వారికి చేతులు జోడించి ప్రార్థిస్తున్నానని పశ్చాత్తాపం ప్రకటించారు ఆయన.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ప్రవీణ్ ప్రకాష్ కు అత్యంత ప్రాధాన్యమిస్తూ వచ్చారు. కీలకమైన పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అయితే విద్యాసంస్కరణలో భాగంగా విద్యా శాఖలో ఎన్నెన్నో మార్పులు జరిగాయి. అయితే పూటకో జీవో, ఉత్తర్వులతో విద్యాశాఖ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి నెల ఒక జిల్లాను సందర్శించి హడలెత్తించారు ప్రవీణ్ ప్రకాష్. అధికారులపై బదిలీ వేటు వేయడం, చర్యలు తీసుకోవడం, ఉపాధ్యాయులను తప్పు పట్టడం, ఆకస్మిక తనిఖీలు.. ఇలా ఒకటేమిటి చాలా విద్యలు ప్రదర్శించారు ప్రవీణ్ ప్రకాష్. కనీసం విద్యాశాఖ అధికారుల వెర్షన్ కూడా వినేవారు కాదు. అప్పటికప్పుడు కఠిన చర్యలకు ఉపక్రమించేవారు. అయితే ఇదంతా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా విద్యాశాఖలో అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ వ్యతిరేక వర్గాలుగా ముద్రపడ్డారు. వారిపై ప్రవీణ్ ప్రకాష్ ద్వారా ప్రభుత్వం కక్ష సాధించిందన్న ఆరోపణలు ఉన్నాయి.టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నలుగురు కీలక అధికారులపై వేటు పడింది. అందులో ప్రవీణ్ ప్రకాష్ ఒకరు. గత ఐదేళ్లుగా ప్రవీణ్ ప్రకాష్ తీరుతో ఇబ్బంది పడిన బాధితులు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా బయటపడుతున్నారు. తమకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రత్యేక వీడియో విడుదల చేశారు.' గత ఏడాదిన్నరలో ఎన్నో నేర్చుకున్నాను. విద్యాశాఖ పురోగతి కోసమే కృషి చేశాను. నేను తనిఖీలతో ఉపాధ్యాయులు, సిబ్బందిని అవమానించాను అంటూ సామాజిక మాధ్యమాల్లో ఎన్నో వచ్చాయి. అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకే అలా మాట్లాడాను. ఎవర్నీ అవమానించేందుకు అలా చేయలేదు. ఎవరైనా అలా భావిస్తే చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. దయచేసి వాటిని మనసులో ఉంచుకోకండి. మరో మనిషిని అవమానించే గుణం నాకు లేదు' అని వీడియోలో స్పష్టం చేశారు.అయితే వైసీపీ సర్కార్లో కీలక అధికారులు చేసిన పుణ్యమా అని ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారడం వెనుక ప్రవీణ్ ప్రకాష్ చర్యలు ఉన్నాయి. ఆయన తీరుతో విసిగి వేశారి పోయిన వారు ప్రభుత్వ వ్యతిరేకులుగా మారిపోయారు. ఆయన చర్యల పుణ్యమా అని వైసిపి మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు ప్రవీణ్ ప్రకాష్ పశ్చాత్తాపం వ్యక్తం చేసినా.. పార్టీ పరంగా వైసిపికి, వ్యక్తిగతంగా ప్రవీణ్ ప్రకాష్ కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# ఈపూరు పాలెంలో హత్యాచారం

## సీఎం సీరియస్ నేర స్థలికి హెూంమంత్రి

బాపట్ల, జూన్ 22 (ప్రజాస్వరం) :

చీరాల మండలం ఈపూరుపాలెంలో గుర్తుతెలియని దుండగులు దారుణంగా హతమార్చారు. రైల్వే పట్టాలపై పడవేశారు. ఆ యువతిని అత్యాచారం చేసి హతమార్చినట్టు ఘటనా స్థలిలో ఆధారాలు కనిపిస్తున్నాయి. డెడ్ బాడీని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. యువతి శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. ఆమెను తీవ్రంగా హింసించి క్రూరంగా హతమార్చినట్టు స్థానికులు భావిస్తున్నారు. నేర స్థలికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెళ్లారు. బాధిత యువతి నెల్లూరు జిల్లా వాసి. సుచరితగా గుర్తించారు.

**కదలిన యంత్రాంగం..**

బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో సుచరిత హత్య కేసుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లా లని హెూంమంత్రి వంగలపూడి అనితను ఆదేశించారు. వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని కలవాలని, ప్రభుత్వం తరపున మృతు రాలి కుటుంబానికి అండగా ఉండాలని హెూంమంత్రికి సీఎం ఆదేశాలు జారీ చేశారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు సీఎం చంద్రబాబు. దర్యాప్తులో అలసత్వం లేకుండా.. జాప్యం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సీఎం ఆదేశాలతో హత్య జరిగిన ఈపురుపాలేనికి హెూం మంత్రి అనిత బయలుదేరారు. ఈ హత్యోందంతాన్ని సీరియస్ గా తీసుకోవాలని డీజీపీ తిరుమలరావును ఆదేశించారు.

# ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో జరిగిన సోదాలపై ఈడీ ప్రకటన

సంగారెడ్డి, జూన్ 22 (ప్రజాస్వరం) :

పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో జరిగిన సోదాలపై ఈడీ ప్రకటన చేసింది. మైనింగ్ పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. మనీలాండరింగ్, హవాలా నేపథ్యంలో సోదాలు చేసాం. సంతోష్ స్యాండ్, సంతోష్ గ్రానైట్ కంపెనీల ద్వారా అక్రమాలు, రూ.300 కోట్లలో మైనింగ్ అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వానికి రూ.39 కోట్లు నష్టం చేకూర్చారు. బ్యాంక్ అకౌంట్లలో అక్రమ లావాదేవీలను గుర్తించామని ప్రకటనలో పేర్కోంది. అక్రమ మార్గంలో డబ్బు మొత్తాన్ని రియల్ఎస్టేట్లో పెట్టుబడులు పెట్టారు. సోదాలు సందర్భంగా రూ.19 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నాం. బినామీ పేర్లతో లావీదేవీలను గుర్తించాం. కొన్ని బ్యాంక్ లాకర్స్ను ఇంకా తెరవాల్సి ఉంది. మధుసూదన్ రెడ్డి, మహిపాల్ రెడ్డికి పలువురు బినామీలుగా ఉన్నారు. వాళ్ళను కూడా విచారణ చేస్తామని ఈటీ వివరించింది.

# పక్కా ప్లాన్‌తో లోకేష్ అడుగులు


గుంటూరు, జూన్ 22 (ప్రజాస్వరం) :



ఏపీ మంత్రి లోకేష్.. జెట్ స్పీడ్ తో పని మొదలు పెట్టేశారు. టీడీపీ గత ప్రభుత్వంలోనూ మంత్రిగా పని చేసినా.. ఇప్పుడు మాత్రం కంప్లీట్ యాక్షన్ ప్లాన్ మార్చేశారు. స్పీడ్ పెంచేశారు. జనానికి మరింత చేరువయ్యేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. బాధ్యతల స్వీకారానికి ముందే రంగంలోకి దిగేశారు. మంగళగిరి నియోజకవర్గం ఏర్పడ్డ 39 ఏళ్లలో అక్కడ టీడీపీకి అసలు విజయమే లేదు. కానీ నారా లోకేష్ రెండో ప్రయత్నంలోనే మంగళగిరిపై టీడీపీ జెండా ఎగరేశారు.తెలుగుదేశం పార్టీకి రికార్డు విజయం సాధించి పెట్టారు. రికార్డు సృష్టించేలా చేశారు. ఎక్కడ కోల్పోయామో అక్కడే గెలవాలి అన్న లక్ష్యంతో పని చేశారు నారా లోకేష్. నిజానికి చంద్రబాబు తనయుడిగా లోకేష్.. టీడీపీకి గట్టి పట్టు ఉండి, కచ్చితంగా గెలిచే చోటును ఏదైనా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. కానీ లోకేష్ రూటే సపరేటు. పార్టీ కండీషన్ చాలా టఫ్ గా ఉన్న చోటే నిలబడి గెలిచారు. అనుకున్నది సాధించారు. చివరికి మంగళగిరి ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. సంక్షోభాల నుంచి అవకాశాలు సృష్టించడం అలవాటు చేసుకున్న చంద్రబాబునే లోకేష్ స్ఫూర్తిగా తీసుకున్నారు. ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇదే మార్క్ చూపిస్తున్నారు. వర్క్ లో కచ్చితత్వం పెంచారు. ఏపీకి ఇప్పుడు ఏం అవసరం.. తనకు ఇచ్చిన శాఖల్లో పురోగతి చూపడం ఎలా అన్నది ఏమాత్రం ఆలస్యం చేయకుండా గ్రౌండ్ వర్క్ పూర్తి చేసి పెట్టుకున్నారు. ఓవైపు పాలన, ఇంకోవైపు పార్టీ.. మరోవైపు ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయడం ఇవన్నిటినీ బ్యాలెన్స్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. చుట్టూ డైనమిక్ టీమ్ ను పెట్టుకున్నారు. దూకుడు పెంచారు.నిజానికి లోకేష్ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకుండా రికమండేషన్ తో మంత్రి అయ్యారని గతంలో వైసీపీ విమర్శించింది. అప్పుడు పని చేసింది కొంత కాలమే అయినా ఐటీ శాఖలో స్పీడ్ పెంచారు. ఇక 2019లో మంగళగిరిలో ఓడిపోయాక నాడు గెలిచిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శల తాకిడి మరింత పెంచారు. అన్నిటినీ భరించారు. ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఘన విజయంతో అందరి ముందు సగర్వంగా నిలబడ్డారు లోకేష్. అంతే కాదు.. తనను గెలిపించిన మంగళగిరి ప్రజలకు వెంటనే ఉపశమనం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవాలనుకున్నారు. అందులో మొదటిది క్యాంప్ ఆఫీస్ లో డే వన్ నుంచి ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు.ఐదేళ్లుగా జనం పాలకుల నుంచి ఏది మిస్సయ్యారో దాన్ని మంత్రి నారా లోకేష్ గ్రహించారు. అందుకే ప్రజాదర్బార్ పేరుతో జనం నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. పరిష్కారంపై భరోసా ఇస్తున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ ప్రోగ్రామ్ జనంపై చాలా ఇంపాక్ట్ చూపిస్తోంది. ఇన్నాళ్లకు తమ సమస్యలు వినే నాయకుడు వచ్చాడు అనుకుంటున్నారు జనం. అటు మంత్రి లోకేష్ కూడా.. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.మంగళగిరి ప్రజల కోసం తమ ఇంటి ద్వారాలు తెరిచే ఉంటాయని ఎన్నికల సమయంలో చెప్పిన మాటను ప్రజాదర్బార్ ద్వారా నిరూపిస్తున్నారు మంత్రి నారా లోకేష్. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా మార్చి తీరుతానంటున్నారు. రెండోసారి మంత్రి అయ్యాక లోకేష్ కు కీలక శాఖలే దక్కాయి. గతంలో చేపట్టిన ఐటీశాఖతో పాటు ఈసారి విద్యాశాఖ కూడా ఇచ్చారు. ఈ రెండూ ఛాలెంజింగ్ పోర్ట్ ఫోలియోసే. అయితే ఈ శాఖల్లో లోకేష్ తొలి రోజు నుంచే తనదైన మార్క్ చూపిస్తున్నారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. రివ్యూ మీటింగ్ లు పెట్టారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ శాఖపై నజర్ పెట్టారు.రాష్ట్రానికి కొత్తగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? కంపెనీలకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న అంశాలపై సమీక్షించారు. వీలైంత త్వరగా రిపోర్టులు ఇవ్వాలన్నారు. బెస్ట్ మెథడ్స్ ఎక్కడ అమలవుతున్నాయో పరిశీలించాలన్నారు. విశాఖను ఐటి హబ్‌గా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్ గా మార్చాలని లోకేష్ ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు రంగాల్లో ఏపీ టాప్ పొజిషన్‌లో ఉండాలని ఇప్పటికే అధికారులకు టార్గెట్ పెట్టారు. పెద్ద పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు.త్వరలోనే కొత్త ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ఐటీ పాలసీని అమలు చేసేందుకు రెడీ అవుతున్నారు. జగన్ పాలనలో ఉనికి కోల్పోయిన ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు పూర్వవైభవం తెచ్చేలా ఫోకస్ పెంచారు లోకేష్. అటు విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కూడా ఉండడంతో ఈ శాఖపై లోకేష్ ఫోకస్ మరింతగా పెంచారు. త్వరలోనే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లి దండ్రులతో భేటీ అయి.. వారి ఆశలు, ఆకాంక్షల ప్రకారం విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న సమస్యలకు పరిష్కారం చూపాలని డిసైడ్ అయ్యారు. ఇందుకోసం సరికొత్త ఐడియాతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రెడీ చేశారు.పేదబిడ్డలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం, అలాగే టీచర్లకు కేవలం చదువుల బాధ్యతలే ఉండేలా చూడాలనుకుంటున్నారు. పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలికవసతుల కల్పన, ఏళ్లతరబడి ఉన్నతవిద్యాశాఖలో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, కోర్టుల్లో ఉన్న చిక్కుముడులను తొలగించి ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్ చేయడం, చిన్నారులకు దేశంలోనే నాణ్యమైన స్కూల్ కిట్స్ అందించేలా చెప్పుకుంటూ వెళ్తే ఇలాంటి టాప్ మోస్ట్ ప్రయారిటీలెన్నో లోకేష్ పెట్టుకున్నారు. ఒక విజన్ తో పని చేస్తున్నారు. చెప్పాలంటే యంత్రాంగాన్ని యాక్టివేట్ చేస్తున్నారు.ఏడాదిలోగా పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆఫీసర్లకు లోకేష్ టార్గెట్ పెట్టారు. మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా నాణ్యతగా ఉండాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఫాలో అవుతున్న విధానాలు, ఇతర రాష్ట్రాల్లో స్కూల్స్ శానిటేషన్ కు సంబంధించిన విధానాలను స్టడీ చేసి వాటి కంటే మెరుగైన పద్ధతి అమలు చేయాలంటున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు మారిన విద్యార్థుల సంఖ్య, అందుకు కారణాలను విశ్లేషించి రిపోర్ట్ ఇవ్వాలని సమగ్ర శిక్షణ అధికారులను ఆదేశించారు. బడిలో చేరి మధ్యలో మానేసిన జనరల్ డ్రాప్ అవుట్స్ వివరాలు కూడా ఇవ్వాలన్నారు. గ్రామాల్లో విద్యార్థులకు స్కూల్ ఎంత దూరంలో అందుబాటులో ఉందన్న వివరాలనూ అడిగారు. గత ఐదేళ్లలో మూతపడ్డ స్కూళ్లు, అందుకు కారణాలు తెలుసుకోవాలని ఆర్డర్ వేశారు.దేశంలోనే బెస్ట్ లైబ్రరీ మోడల్ ఎక్కడ ఉందో తెలుసుకుని, సమీక్ష చేసి అందుకు సంబంధించిన నోట్ ను కూడా అందజేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇక ఈనెల 15న ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమీక్షించిన సమయంలో.. ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులకు గత వైసిపి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వడం ఆపేసిందని తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పుస్తకాలు లేకుండా పేదవిద్యార్థులు ఎలా చదువుతారని ఆ సమావేశంలోనే అధికారులను ప్రశ్నించారు.ఈ విద్యా సంవత్సరం నుంచి వెంటనే ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. జులై 15 నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని లోకేష్ ఆదేశించడంతో ఆఫీసర్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఓవైపు ఇవన్నీ చేస్తూనే.. పూర్తిస్థాయిలో కేంద్ర నిధులను వినియోగించుకునేలా తగిన ప్రణాళికలకు ఆదేశించారు. సో ఓవరాల్ గా బాధ్యతల స్వీకారానికి ముందే తనకు అప్పగించిన శాఖలపై మంత్రి నారా లోకేష్ ఓ విడత కసరత్తు పూర్తి చేసేశారు. ఇక బాధ్యతల స్వీకారం తర్వాత యాక్షన్ ప్లాన్ మరింత స్పీడ్ అవడం ఖాయంగా కనిపిస్తోంది.

# అమరావతిపై మాస్టర్ ప్లాన్ రెడీ





విజయవాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :

ఒక రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో రాజధాని అనేది కీలకం. కానీ దురదృష్టవశాత్తు గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రానికి రాజధాని అన్నది లేకుండా పోయింది. రాజకీయ స్వార్థానికి మొగ్గ దశలో ఉన్న అమరావతి సమిధగా మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి అమరావతిని చిదిమేసింది. రాజధాని నిర్మాణాలను పాడుబెట్టింది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల చెర వీడిన అమరావతి రాబోయే ఐదేళ్లలో ప్రజా రాజధానిగా అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కీలకమైన నిర్మాణాలను పునః ప్రారంభించాల్సి ఉంటుంది. ఐకానిక్ టవర్స్ : అమరావతిలో ఐకానిక్ టవర్స్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు చంద్రబాబు. ఇప్పటికే చాలా వాటి నిర్మాణం పూర్తయింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నివాసం ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. వాటిని వినియోగం లోకి తేవాల్సిన తక్షణ అవసరం ఇప్పుడు ఏర్పడింది. కీలక నిర్మాణాలు: టిడిపి ప్రభుత్వ హయాంలో విభాగాధిపతులు, సచివాలయం, శాశ్వత హైకోర్టు భవనాల పునాదులు గత ఐదేళ్లుగా నీటిలో నానుతున్నాయి. ఈ నిర్మాణాల పటిష్టతను సాంకేతిక నిపుణులతో అంచనా వేయించాలి. సవరించిన అంచనాలతో తిరిగి పనులు ప్రారంభించాలి. ఈ ఐదేళ్లలో వీటిని పూర్తయ్యేలా చూడాలి. పెండింగ్ భూ సేకరణ: రాజధాని నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ అంశం పెండింగ్లో ఉంది. రైతులకు కేటాయించిన ప్లాట్లు, వాటికి సంబంధించిన న్యాయపరమైన చిక్కులను సత్వరమే పరిష్కరించాలి. ఆ భూములను సిఆర్డిఏ కు తిరిగి దక్కులు పడేలా చూడాలి. ఏపీ సి ఆర్ డి ఏ చట్టం, పునర్విభజన చట్టం, అమరావతి బృహత్ ప్రణాళిక, కేంద్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నోటిపై చేసేందుకు న్యాయపరమైన చర్యలను ప్రారంభించాలి. రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు : రైతుల రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలి. వాటిని అన్ని వస్తువులతో అభివృద్ధి చేయాలి. దీనివల్ల రాజధానిలో నివాసయోగ్యత స్థాయి పెరుగుతుంది. పెండింగ్ ప్లాట్లు, కేటాయించిన ప్లాట్ లలో ఇంకా చేయించాల్సిన రిజిస్ట్రేషన్ లను నిర్దిష్ట కాల పరిమితిలోగా పూర్తి చేయాలి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం : అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకం. దానికి అనుసంధానంగా రహదారుల నిర్మాణం పూర్తి చేయాలి. శాశ్వత హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం, విభాగాధిపతుల భవనాలు, హ్యాపీ నెస్ట్ తదితర ప్రాజెక్టులను పునరుద్ధరించాలి. రాజధానిని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు జాతీయ, రాష్ట్ర రహదారులతో అనుసంధానించాలి. ఎన్ఐడి, ఎస్ఆర్ఎం, విట్ తదితర ప్రతిష్టాత్మక సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. దళితులు అధికంగా నివసించే అమరావతిలో అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలి. రాజధానిలో సాగునీరు, తాగునీరు అవసరాల కోసం వైకుంటపురం వద్ద 45 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి. అన్నింటికీ మించి రాజధాని పరిధిలోని గ్రామాలతో అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు న్యాయపరమైన చిక్కులను అధిగమించాలి. రాజధాని లో భూములు కేటాయించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు వెంటనే పనులు ప్రారంభించి నిర్దిష్ట కాల పరిమితితో కార్యకలాపాలు సాగించేలా చూడాలి.

# 28పాతబస్తీలో పోలీసుల తనిఖీలు

హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం) :

హైదరాబాద్ పాతబస్తీ లో ఇటీవల జరిగిన హత్య ల ఘటనా నేపథ్యంలో పాతబస్తీలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ లు నిర్వహించారు. హైదరాబాద్ చదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అజాం పుర, మలక్ పెట్ , చదర్ ఘాట్ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు...

# అతిసార ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు

## జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

**బద్వేలు, జూన్ 22 (ప్రజాస్వరం) :**

అన్నమయ్య జిల్లాలో విస్తృతంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ లు నిర్వహించి డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శనివారంసచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అతిసార కేసుల వ్యాప్తి (స్టాప్ డయేరియా క్యాంపెయిన్), తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు.రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ లు విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒక ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ, మానిటరింగ్ మెకానిజం అమలు చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని, ఆశా వర్కర్ ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం మరియు తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా డయేరియా, అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

**సంక్షేమ శాఖలు మెరుగ్గా పనిచేయాలి**

జిల్లాలోని సంక్షేమ శాఖలు సమర్ధవంతంగా పనిచేయాలి. ఆయా సంక్షేమ శాఖల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించగలిగి సమర్థవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్ధకమవుతుందని జిల్లా కలెక్టర్ యం. అభిషిక్త్ కిషోర్ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లోఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ, మహిళ శిశు సంక్షేమం మరియు సంక్షేమ శాఖల కార్పొరేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ సంక్షేమ శాఖలలో ఏమేమి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, అందులో భౌతిక, ఆర్థిక లక్ష్యం, సాధించిన ప్రగతి, జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు ఎన్ని, వాటిలో గల విద్యార్థుల సంఖ్య, హాస్టల్లోని సౌకర్యాలు, మెనూ, స్కాలర్షిప్స్, స్టడీ సర్కిల్స్, కమ్యూనిటీ హాల్స్ అంశాలు, అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖలో జిల్లాలో ఎన్ని ప్రాజెక్టులు, క్లస్టర్లు ఉన్నాయి, ఏయే పథకాలు అమలు చేస్తున్నారు, మహిళలు, పిల్లలకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, వన్ స్టాప్ సెంటర్, దిశా, చైల్డ్ ప్రొటెక్షన్, ఆర్ఫన్ హోమ్స్, వికలాంగ శాఖ ద్వారా అమలుపరుస్తున్న పథకాలు, కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న పథకాలు తదితరాలలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ, మహిళా శిశు సంక్షేమం శాఖల పరిధిలో ఎవరైతే ఉన్నారో వారికి సంబంధించిన అవసరాలు, ఎలాంటి సదుపాయాలు అవసరమో జిల్లా అధికారులకు తప్పనిసరిగా తెలిసి ఉండాలి. పిల్లలు కానీ మహిళలు కానీ సంక్షేమ శాఖల లక్షిత వర్గాల అవసరాలను గుర్తించాలి. ఏవైతే ప్రభుత్వ పథకాలు ఉన్నాయో వాటిని మరింత మెరుగ్గా పారదర్శకంగా ప్రజలకు అందజేయాలి. సహజంగా ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికే మనమందరం ప్రయత్నిస్తున్నాం. వారి అవసరాలు గుర్తించి ఆ దిశగా సమర్ధవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్థకం అవుతుంది. ఎవరెవరికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించడానికి వివిధ మార్గాలలో మూలాలను గుర్తించాలి. జిల్లాలో ఎక్కడ ఏం జరుగుతోంది, ఎక్కడ వలసలు ఎక్కువగా ఉన్నాయి,మహిళల సమస్యలు ఏమిటి, రాయచోటి రాజంపేట మదనపల్లి డివిజన్ ప్రాంతాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయి, ఏ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయి, ఎక్కడ ఏ ప్రాంతంలో ఎక్కువ పని చేస్తున్నవారు ఉంటారు, ఆ ప్రాంతంలో వారి అవసరాలు ఏమిటి సమస్య ఏంటి అన్నవి గుర్తించగలగాలి. ఉదాహరణకు ఎక్కడైనా ఒకచోట కమ్యూనిటీ హాల్ అవసరం ఉంటేనిబంధనల మేరకు ప్రభుత్వ పరంగా చేయలేకపోతే సామాజిక బాధ్యత కింద చేయవచ్చు.ఇందుకు ముందుగా అవసరాలను గుర్తిస్తే వాటికి తగినట్టుగా ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఏమేం ఉన్నాయి, ఏ విధంగా వీటిని సమన్వయం చేసి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించవచ్చునని ఆలోచన చేయాలన్నారు. మూస ధోరణిలో కాకుండా ఆచరణాత్మక దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలలో ఎవరైనా జీవనోపాధి గురించి చూస్తుంటేప్రభుత్వమే అని కాకుండా దాతలు లేదా ఇతరత్రా కూడా ముందుకు వచ్చిన వారిని సమన్వయం చేసుకొని ఒక యూనిట్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయి. అలాగే ఎక్కడైనా హాస్టల్లో కనీస సౌకర్యాలు లేనప్పుడు అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించి చేయాలి. లేదా స్థానికంగా ఎవరైనా దాతలను ప్రోత్సహించి వసతులు కల్పించవచ్చు. ఇక్కడ ప్రభుత్వం చేసిందా ప్రభుత్వేతర సంస్థలు, వ్యక్తులు చేశారా అన్నదానికంటే ప్రజలకు అవసరమైన వాటిని చేయగలిగామా లేదా అన్నది ముఖ్యం. చెయ్యడానికి ఏం లేదు కదా ఎందుకు తెలుసుకోవాలని అభిప్రాయం ఉండరాదనిమూస ధోరణి ఆలోచనలను మార్చుకొని అవసరమైన వారికి సహాయం అందించగలిగేలా చర్యలు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# తాడేపల్లిలో వైసీపీ కార్యాలయం కూల్చివేత

**విజయవాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :**




నిబంధనలకు విరుద్ధంగా ఉందని అమరావతిలోని తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయాన్ని సీఆర్డీఏ అధికారులు కూల్చేశారు. శనివారం వేకువ జామున పోలీసుల పహారా మధ్య పడగొట్టేశారు. సీతానగరం వద్ద ఉన్న వైసీపీ కార్యలయాన్ని ఐదు గంటల ప్రాంతంలో ప్రొక్లెయినర్లు, బుల్డోజర్లతో సీఆర్డిఏ అధికారులు కూల్చేశారు. ఇది ఫస్ట్ ఫ్లోర్ శ్లాబ్ వేయడానికి సిద్ధమవుతున్న టైంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. నీటిపారుదల శాఖ స్థలంలో భవనం నిర్మించారని అందుకే చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. బోట్ యార్డుగా ఉపయోగించే స్థలాన్ని తాను అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి తక్కువ లీజుతో కట్టబెట్టారని అది చట్టవిరుద్ధమనే ఇప్పుడు చర్యలు తీసుకున్నామని అధికార టీడీపీ చెబుతోంది. దీనిపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్టు కూడా పేర్కొంటున్నారు. కూల్చే టైంలో అటుగా కార్యకర్తలు వేరే నేతలు రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నా భారీ భద్రత మధ్య కూల్చివేతలు సాగాయి. సీఆర్డీఏ అధికారులు కూల్చే టైంలోనే వైసీపీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో తొందరపాటు చర్యలు వద్దని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇంతలోనే అధికారులు పని పూర్తి చేశారు. దీనిట్కప వైసీపీ నేతలు మండిపడుతున్నారు. ఇది చంద్రబాబు ఇంటికి సమీపంలో ఉందన్న కారణంతోనే కూల్చేశారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఐదేళ్ల పాలన ఎలా ఉంటుందో చంద్రబాబు శాంపిల్గా చూపించారని అన్నారు మాజీ సీఎం జగన్. దేశంలోని ప్రజాస్వామ్యులంతా ఈ ఘోరాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. "ఆంధ్రప్రదేశ్లో రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరోస్థాయికి తీసుకెళ్లారు. ఒక నియంతలా తాడేపల్లిలో దాదాపు పూర్తికావొచ్చిన వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయించారు. హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు, ఈ ఘటన ద్వారా ఈ ఐదేళ్లపాటు పాలన ఏవిధంగా ఉండబోతుందనే హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు. ఈ బెదిరింపులకు, ఈ కక్షసాధింపు చర్యలకు వైసీపీ తలొగ్గేది లేదు, వెన్నుచూపేది అంతకన్నా లేదు. ప్రజల తరఫున, ప్రజల కోసం, ప్రజల తోడుగా గట్టిపోరాటాలు చేస్తాం. దేశంలోని ప్రజాస్వామ్య వాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని కోరుతున్నాను." అని జగన్ ట్వీట్ చేశారు.

# మారని కెనడా వైఖరి

**న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రజాస్వరం) :**

ప్రశాంతంగా ఉన్న భారత్లో చిచ్చు పెట్టాలని ఇప్పటికే దాయాది దేశం పాకిస్తాన్, మరో పొరుగు దేశం చైనా తరచూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. వీటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొడుతోంది. ఇలాంటి పరిస్థితిలో ఈ రెండు దేశాలకు మరో దేశం తోడైంది. ఖలిస్తానీ తీవ్రవాది హర్దీప్సింగ్ నిజ్జర్కు వత్తాసు పలుకుతూ భారత్తో గిచ్చి కయ్యం పెట్టుకుంటోంది.నిజ్జర్ మొదటి వర్ధంతి సందర్భంగా కెనడా పార్లమెంట్ నివాళు లర్పించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఖలిస్తానీ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ గతేడాది కెనడాలోని సర్రే ప్రాంతంలో ఓ గురుద్వారా ముందు జరిగిన కాల్పుల్లో మృతిచెందాడు. భారత్ విడుదల చేసిన 40 మంది తీవ్రవాదుల జాబితాలో హర్దీప్ సింగ్ నిజ్జర్ పేరు కూడా ఉండడం గమనార్హం.నిజ్జర్ను హత్య చేసిన వారిలో నలుగురు భారతీయులు కరణ్ బ్రార్, అమన్దీప్సింగ్, కమల్ ప్రీత్సింగ్, కరణ్ప్రీత్సింగ్ నిందితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తీవ్రవాది హత్యతో భారత్ హస్తం ఉందని కెనడా తీవ్ర ఆరోపణ చేసింది. ఈ ఆరోపణను భారత్ ఖండించింది. అప్పటి నుంచి భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇటీవల ఇటలీలో జరిగిన జీ7 సమ్మిట్లో ప్రధాని మోదీ, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్థిక సంబంధాలు, జాతీయ భద్రత విషయాల్లో భారత్ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంతో సంబంధాలు ఏర్పర్చుకునే అవకాశం ఉందని ట్రూడో తెలిపారు.దీనిపై భారత్ కూడా స్పందించింది. వాంకోవర్లోని భారత కాన్సులేట్ జనరల్ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. 'ఉగ్రవాద ముప్పును ఎదుర్కోవడంలో భారత్ ముందంజలో ఉంది. అదీకాక, ఉగ్రవాద ముప్పు పరిష్కారానికి ప్రపంచ దేశాలో కలిసి పనిచేస్తాం. 1985లో ఎయిరిండియా విమానం 182 (కనిష్క)పై ఖలిస్తానీ ఉగ్రవాదులు చేసిన బాంబుదాడి ఘటనకు జూన్ 23తో 39 ఏళ్లు పూర్తవుతుంది. ఈ దాడి ఘటనలో 86 మంది చిన్నారులతోపాటు 329 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖలిస్తానీ ఉగ్రవాదులు కనిష్క ఎయిరిండియా విమానంపై చేసిన బాంబు దాడిలో మృతిచెందిన వారికి స్మారకంగా నివాళులర్పిస్తాం. జూన్ 23న స్టాన్లీ పార్క్లోని సెపర్లీ ప్లేగ్రౌండ్లో జరిగే స్మారక కార్యక్రమంలో భారతీయులు పాల్గొని తీవ్రవాదానికి వ్యతిరేకంగా సంఘీభావం తెలపాలి' అని పేర్కొంది.

## ఆసిఫ్ నగర్లో మరో హత్య

**హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం) :**

ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహదీపట్నంలో మరో దారుణ హత్య జరిగింది. సెయింట్ ఆన్స్ న్స్ కళాశాల వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు.

## విలవిలలాడుతున్న మక్కా

**మక్కా, జూన్ 22 (ప్రజాస్వరం) :**

పవిత్ర మక్కా మాడిపోతుంది. మండే ఎండలకు విలవిలలాడుతోంది. గాలిలో తేమ తగ్గిపోయి, వేడిగాలులు తీవ్రంగా విస్తుండడంతో జనం నరకం చూస్తున్నారు. మక్కా గ్రాండ్ మసీదు వద్ద 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో హజ్ యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులు, తీవ్రమైన ఉక్కపోత వల్ల ఇప్పటివరకు 650 మంది హజ్ యాత్రికులు మృత్యువాత పడ్డారు. హజ్ యాత్ర చరిత్రలో ఇటువంటి విషాదం గతంలో ఎన్నడూ చోటు చేసుకోలేదు. యాత్రికుల మృతి విషయాన్ని సౌదీ దౌత్య వ్యక్తులు ధ్రువీకరించారు. మరణించిన యాత్రికుల్లో 323 మంది ఈజిప్షియన్లు ఉన్నారని తెలుస్తోంది. వేడి గాలులు, ఉక్కపోత వల్ల చనిపోయిన వారి మృతదేహాలను(550 మంది) మక్కాలోని ఆల్ ముయిసెమ్ ఆసుపత్రిలో భద్రపరిచారు.. ఇక జోర్డాన్ ప్రాంతంలో కూడా 60 మంది వరకు చనిపోయారు. గతంలో వేడి గాలుల వల్ల ఈ ప్రాంతంలో 41 మంది చనిపోయారు.. ఇక వివిధ దేశాల లెక్కల ప్రకారం మొత్తంగా హజ్ యాత్రలో వేడిగాలు వల్ల చనిపోయిన వారు 577 మంది అని తెలుస్తోంది.మక్కా ప్రాంతంలో ఇస్లాం ఐదు స్తంభాలలో ఒకటిగా హజ్ నిలుస్తోంది. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా హజ్ ను దర్శించుకోవాలని భావిస్తారు. దీనికోసం ఎంత కష్టమైనా పడతారు. వాస్తవానికి ఈసారి హజ్ యాత్ర ప్రారంభ సమయంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని.. గతంతో పోల్చితే ఈసారి 0.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరగడం.. వేడి గాలులు తీవ్రంగా ఉండడంతో అది యాత్రికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సౌదీ అరేబియా అధికారులు అంటున్నారు. మక్కా గ్రాండ్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ నుంచి, వేడి గాలుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఈజిప్షియన్లు ఇతర ప్రాంతాలకు పరుగులు తీశారు. దీంతో వారు తప్పిపోయారు. ఈ విషయాన్ని ఈజిప్ట్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌదీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయితే వారందరినీ కూడా వడ దెబ్బ మృతుల కింద సౌదీ అధికారులు ఆ నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఇక యాత్రికుల్లో 2000 మంది వడదెబ్బకు గురి కావడంతో.. వారందరికీ స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది హజ్ యాత్ర సమయంలో వివిధ దేశాలకు చెందిన 240 మంది యాత్రికులు వడదెబ్బకు గురై మరణించారు..ఈసారి వడ తీవ్రంగా ఉండడంతో మక్కా సమీపంలోని మీనా ప్రాంతంలో పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సేవకులు యాత్రికులకు శీతల పానీయాలు, ఐస్ క్రీమ్ పంపిణీ చేస్తున్నారు. చల్లని నీళ్లను అందిస్తుండడంతో.. ఒంటిపై పోసుకొని చల్లబరుచుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి యాత్రికులు తమను తాము రక్షించుకునేందుకు గొడుగులు, హైడ్రేట్ డ్రింకులు వాడాలని సూచిస్తున్నారు. అయితే ఆచారంలో భాగంగా మంటూ అరాఫత్ ప్రార్థన సమయంలో యాత్రికులు బహిరంగంగా ఉండాల్సి ఉంటుంది.. అలాంటి సమయంలో పైన వేడి, తీవ్రమైన ఉక్కపోత వల్ల యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సంవత్సరం సుమారు 1.8 మిలియన్ల మంది హజ్ యాత్రలో పాల్గొన్నారు. ఇందులో విదేశాల నుంచి 1.6 మిలియన్ల మంది వచ్చారు.. వీరందరికీ సౌదీ అరేబియా ప్రభుత్వం అపారమైన భద్రత కల్పించింది. అయితే ఈసారి ఎండలు పెరగడంతో యాత్రికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వడదెబ్బ మృతుల్లో ఎక్కువ శాతం మధుమేహం, రక్తపోటు సంబంధిత వ్యాధులు ఉన్న వారేనని సౌదీ అరేబియా ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

## బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్.సవిత

**విజయవాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :**

విజయవాడలోని విద్యుత్ కాలనీలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో అందిస్తున్న భోజనం,హాస్టల్లోని మౌలిక సదుపాయాల ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్ పరిసరాలను భోజనశాల,వంట గదులను మంత్రి పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.భోజనశాల, వంట గదులను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.ఆహార పదార్దాల నాణ్యతపైని అరా తీశారు.విద్యార్థులు నిద్రించే రూములు వారు ఉపయోగించే మరుగు దోడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్ ను మంత్రి సవిత మందలించారు.ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణంపై విద్యార్థులను నేరుగా ఆడిగి తెల్సుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత లేకపోవడంతో పైనా ఆగ్రహం వ్యక్తం చేసారు. పద్ధతి మార్చుకోవాలని వార్డెన్ ను మంత్రి హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి సవిత మాట్లాడుతూ అందరూ బాగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.తదుపరి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఏ సమస్య ఉన్న నేరుగా తనకు ఫోన్ చేయమని విద్యార్థులకు మంత్రి ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన నాలుగేళ్లకు సర్కారీ ఉద్యోగం

**హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం) :**

సర్కార్ కొలువు సాదించడమే లక్ష్యంగా ఆరేళ్లు కష్టపడ్డాడు. రెండుసార్లు కొలువుకు ప్రయత్నించాడు. ఫలితం రాకపోవడంతో మనోవేధనకు గురయ్యాడు. అదే సమయంలో అనారోగ్యంతో అక్కా, తల్లి మృతి చెందడంతో మరింత కుంగిపోయాడు. ఇక, సర్కార్ కొలువు రాదని తీవ్ర మనస్తాపంతో ఉరి వేసుకునికి ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆ యువకుడు. తీరా ఆ యువకుడు చనిపోయిన నాలుగేళ్లకు ప్రభుత్వం ఉద్యోగం సాధించావంటూ పిలుపు వచ్చింది. ఉద్యోగంలో చేరాలంటూ ఇంటికి ఉత్తరం వచ్చింది. కానీ, ఆ యువకుడు చనిపోయాడని తెలిసిన సమాచారం తెచ్చిన పోస్ట్ మ్యాన్ సైతం కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరణం తర్వాత పలకరించిన సర్కార్ కొలువు పిలుపు వార్త మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది.మంచిర్యాల జిల్లా సింగరేణి ప్రాంతం మందమర్రి ఫస్ట్ జోన్ కి చెందిన సిద్దెంకి మొండయ్య, సరోజ దంపతులకు నవీన్ కుమార్, అనూష, ఆదిత్య, జీవన్ కుమార్ నలుగురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు మానసిక దివ్యాంగులు. జీవన్ కుమార్ (24) 2014లో ఐటీఐ పూర్తి చేశారు. 2018 లో వెలువడిన విద్యుత్ శాఖ లైన్ మెన్ పోస్ట్ కు అప్లై చేశాడు. పరీక్ష కూడా రాసి ఫలితాల కోసం ఎదురు చూశాడు. అదే సమయంలో అనారోగ్యంతో అక్క ఆదిత్య 2018 లో మృతి చెందింది.. ఆ వెంటనే తల్లి సరోజ సైతం అనారోగ్యంతో జనవరి, 2019లో మరణించింది.వరుస విషాదాలు ఓ వైపు ఉద్యోగం దక్కడం లేదని మరో వైపు మనోవేధనకు గురయ్యాడు జీవన్ కుమార్. సింగరేణిలోను ఉద్యోగానికి ప్రయత్నించి విఫలమవడంతో 2020 మార్చి 15న ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు జీవన్ కుమార్. జీవన్ మృతి చెందిన ఏడాదికే అక్క అనూష, తండ్రి మొండయ్య సైతం మృతి చెందడం ఆ ఇంటిని వల్లకాడుల మార్చింది. ఆరుగురు కుటుంబ సభ్యులున్న ఆ ఇంట్లో వరుస మరణాలతో చివరకు పెద్దకొడుకు నవీన్ ఒక్కరే మిగిలాడుఇంత విషాదం నిండిన ఆ ఇంటిని రెండు రోజుల క్రితం ఓ వార్త మరింత కన్నీళ్లు పెట్టించింది. జీవన్ కుమార్ ను వెతుక్కుంటూ వచ్చిన ఫోస్ట్ మ్యాన్ మీకు ప్రభుత్వం ఉద్యోగం వచ్చిందని నవీన్ కుమార్ కు లెటర్ అందించాడు. మా తమ్ముడు చనిపోయి నాలుగేళ్లైందంటూ కన్నీరు మున్నీరయ్యాడు నవీన్. శుభవార్త మోసుకొచ్చానని భావించిన ఫోస్ట్ మ్యాన్ సైతం ప్రభుత్వ ఉద్యోగ కాల్ లెటర్ అందుకోవాల్సిన వ్యక్తి నాలుగేళ్ల క్రితమే చనిపోయాడని తెలిసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. చనిపోయిన నాలుగేళ్ల తర్వాత ఉద్యోగ చివరి పరీక్షకు హాజరు కావాలని కాల్ లెటర్ రావడం మరింత బాధించిందని జీవన్ కుమార్ అన్న నవీన్ కుమార్ తెలిపాడు. ఈ ఘటన మందమర్రిలో శుక్రవారం చోటుచేసుకుంది.ఎన్పీడీసీఎల్ లో జూనియర్ లైన్మెన్ పోస్టుల భర్తీ కోసం 2018లో అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించింది అప్పటి సర్కార్. మిగులు పోస్టుల భర్తీ విషయంలో కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భర్తీ ప్రక్రియ నిలిచి పోయింది. ఈ పోస్ట్ తప్పక సాధిస్తానని ఆశలు పెంచుకున్న జీవన్ కుమార్.. రెండేళ్లైన సమాచారం రాకపోవడం ఇంట్లో వరుస మరణాలతో గుండె బరువెక్కి మనోవేధనతో ఆత్మహత్య చేసుకున్నాడు. తీరా మెరిట్ లిస్ట్ ప్రకారం కొత్త ప్రభుత్వం నియామకాలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మందమర్రికి చెందిన జీవన్ కుమార్ కు విద్యుత్తు స్తంభం ఎక్కే పరీక్షకు ఈ నెల 24న హాజరుకావాలని కాలెటర్ రావడం.. అప్పటికే అతను చనిపోయి నాలుగేళ్లు అయిందని తెలియడంతో.. ఏం చేయాలో తెలియక కాల్ లెటర్ తిరిగి తీసుకెళ్లక తప్పలేదు పోస్ట్ మ్యాన్ కు.సర్కార్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని, నాలుగేళ్ల క్రితమే జీవన్ కుమార్కు కొలువు వచ్చి ఉంటే, ఆ ఇళ్లు సుఖ సంతోషాలతో ఉండేదేమో అని, ఇప్పుడు అయిన వారందరని కోల్పోయి వల్లకాడుల మారేది కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## వివేకా హత్య కేసు విచారణ జులై 5కి వాయిదా

**నాంపల్లి సీబీఐ కోర్టులో వివేకా హత్య కేసు విచారణ**

**హాజరైన అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఇతర నిందితులు**

**దస్తగిరి పిటిషన్ పైనా వాదనలు విన్న సీబీఐ న్యాయస్థానం**

**దస్తగిరి పిటిషన్పై విచారణ జులై 11కి వాయిదా**

**హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం) :**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను హైదరాబాదులోని నాంపల్లి సీబీఐ కోర్టు వచ్చే నెల 5కి వాయిదా వేసింది. నేడు విచారణ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి, ఇతర నిందితులు కోర్టుకు హాజరయ్యారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇవాళ్టి విచారణ సందర్భంగా... సాక్షిగా పరిగణించాలంటూ దస్తగిరి వేసిన పిటిషన్ పైనా కోర్టు వాదనలు విన్నది. సీబీఐ చార్జిషీట్ లోనూ సాక్షిగా చూపారని దస్తగిరి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దస్తగిరి పిటిషన్ పై తదుపరి విచారణను సీబీఐ కోర్టు జులై 11కి వాయిదా వేసింది.

## నాకుటుంబాన్ని చంపేయండి : ముద్రగడ

**ఏలూరు, జూన్ 22 (ప్రజాస్వరం) :**

ముద్రగడ పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న తర్వాత తొలిసారిగా మీడియా ముందుకొచ్చిన మాజీ మంత్రి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ప్రజలతో తనను, తన కుటుంబాన్ని బూతులు తిట్టిస్తున్నారని, దాని బదులు తమ కుటుంబాన్ని చంపేయాలని కోరారు. మొత్తం తమ కుటుంబంలో ఏడుగురు ఉన్నారని, అందర్నీ చంపేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ముద్రగడ. సవాల్ కి కట్టుబడి ఉన్నాను కాబట్టే తన పేరు మార్చుకున్నానని చెప్పారాయన.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పవన్ చేతుల్లో ఉన్నాయి కాబట్టి కాపులకు రిజర్వేషన్ సాధించాలన్నారు. ప్రత్యేక హెూదా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం పోరాడాలి అని గుర్తు చేశారు. సినిమాలు ఆపెయ్ పవన్.. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక సినిమాలు వదిలేశారని, పవన్ కళ్యాణ్ కూడా సినిమాలు వదిలేసి ప్రజాసేవ చేయాలని కోరారు ముద్రగడ. వైసీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని, వెంటే వాటిని ఆపేయాలన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు వాలంటీర్ల ధర్నా

**కాకినాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :**

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కాకినాడ నగరంలోని పలుడివిజన్లకు చెందిన వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ తమకు రాజీనామా చేయడం ఇష్టం లేకున్నా వైకాపా నేతలు, కార్యకర్తలు చెప్పిన మాటలతో తాము రాజీనామా చేసామే తప్పా మనస్ఫూర్తిగా చేయలేదని వాపోయారు తాము కోవిడ్ సమయంలో కుటుంబాన్ని వదిలేసి ప్రజలకు పలు సేవలు అందించామని అటువంటి తమను వైకాపాకు చెందిన పలువురు నేతలు కార్యకర్తలు తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని మీరు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో తప్పని పరిస్థితుల్లో రాజీనామాలు సమర్పించామన్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీకి చెందిన నాయకుల ఎవరూ కూడా తమకు ధైర్యం చెప్పకపోగా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పాటు సేవలందించి తమను తిరిగి విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్లను వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.


## బస్సు కింద పడుకుని యువకుడు చేసిన స్టంట్‌పై సజ్జనార్ సీరియస్



**హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం) :**

హైదరాబాద్: ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడుకొని ఓ యువకుడు చేసిన వీడియోపై తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఓ యువకుడు ఆర్టీసీ బస్సు కింద పడుకుని స్టంట్ చేసినట్లుగా ఓ వీడియో సోషల్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వీడియోను బాగా గమనిస్తే.. అది ఫేక్ అని తెలిసిపోతుంది. ఎవరో గ్రీన్ మ్యాట్‌లో వీడియో చిత్రీకరించి, దాన్ని బస్సు కింద పడుకున్నట్లుగా ఎడిట్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. తాజాగా, ఈ వీడియోపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. ఈ వీడియో పూర్తిగా ఫేక్ అని సజ్జనార్ తెలిపారు. సోషల్ మీడియాలో పాపులర్ అయ్యేందుకు ఇలాంటి వీడియోలను ఎడిట్ చేసి వదులుతున్నారని తెలిపారు. ఇలాంటి వెకిలిచేష్టలతో ఆర్టీసీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. లైక్‌లు, కామెంట్ల కోసం చేసే ఈ తరహా అనాలోచిత పనులను ఇతరులు అనుకరించే ప్రమాదం పొంచి ఉందన్నారు. కొందరు తమ సరదా కోసం ఇలాంటి వీడియోలను ఎడిట్ చేసి షేర్ చేస్తే.. వాటి కారణంగా ఇతరులు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇలాంటి ఘటనలను టీజీ ఆర్టీసీ సీరియస్‌గా తీసుకుంటుందని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అయ్యన్నపాత్రుడు



**విజయవాడ, జూన్ 22 (ప్రజాస్వరం) :**

అసెంబ్లీ స్పీకర్ గా సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారులి.లిఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. 1983 లో టిడిపి ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన ఒకసారి ఎంపీగా,ఏడుసార్లు నర్సీపట్నం ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

# శీతాకాలంలో చల్లని నీళ్లతో స్నానం చేస్తున్నారా?

చలికాలం వచ్చిందంటే చాలా మంది తలస్నానం చేయడానికి ఇష్టపడరు. కొందరు ఏడాది పొడవునా చల్లటి నీళ్లతో స్నానం చేస్తుంటారు. కానీ చలికాలం వచ్చిందంటే కాస్త గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయడం బెటర్ అంటున్నారు నిపుణులు.కాస్త చిన్న వయసు వారు 15 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా చాలా మంది చల్లటి నీటితో స్నానం చేయవచ్చు. కానీ వృద్ధాప్యం సమీపించేవారు చలికాలంలో చల్లటి స్నానం చేయడం హానికరం. చలికాలంలో తలపై చల్లటి నీరు పోసుకోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. చలికాలంలో చల్లని నీళ్ల స్నానం బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని మరింత పెంచుతుందట. తలపై చల్లటి నీరు పోసుకోవడం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి రక్తపోటు ఒక్కసారిగా పెరుగుతుంది. అలాగే మెదడులోని ఉష్ణోగ్రతను నియంత్రించే అడ్రినలిన్ హార్మోన్ వేగంగా విడుదలవుతుంది. ఇలాంటి పరిస్థితిలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వయసు పెరిగే కొద్దీ మెదడు కణాలు కూడా బలహీనపడతాయి. అటువంటి పరిస్థితిలో రక్తపోటు పెరిగితే ధమనులలో రక్తం గడ్డకట్టడం, మెదడు సిర పగిలి రక్తస్రావం అవడం జరుగుతుంది. ఇలా జరిగితే ఒక్కోసారి మరణం కూడా సంభవిస్తుంది. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలతో బాధపడేవారికి ఈ సీజన్‌లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. మీ వయసు 60కి దగ్గరగా ఉంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని నివారించడానికి, చల్లని నీళ్లకు బదులుగా గోరువెచ్చని నీళ్లలో స్నానం చేయాలి. తొలుత పాదాలను తడి చేసుకుని, ఆ తర్వాత నీళ్ళు శరీరంపై పోసుకోవాలి. శీతాకాలంలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని నివారించడానికి క్రమం తప్పకుండా యోగా





చేయాలి. ఎక్కువ సీజనల్ పండ్లు, కూరగాయలు తినాలి. ప్రాసెస్ చేసిన అధిక కొవ్వు పదార్థాలను తినడం నివారించాలి. శరీరం వెచ్చగా ఉండటానికి ఉన్ని దుస్తులను ధరించాలి.

## హిందూమతంలో కాకి చాలా ప్రత్యేకం.. ?

హిందూ మతంలో గ్రహాలకు ప్రత్యేక స్థానం ఉంది. నవ గ్రహాల్లో సూర్యుడి తనయుడు శనీశ్వరుడిని న్యాయ దేవుడు అని పిలుస్తారు. శనీశ్వరుడు శివునికి గొప్ప భక్తుడు. కర్మ ప్రదాత అయిన శనీశ్వరుడు వ్యక్తికి చేసే పనులకు తగిన ఫలితాలను ఇవ్వడమే కాదు.. మంచి పనులను చేసే వ్యక్తిపై తన ఆశీర్వాదాలను ఇస్తాడు. చెడు కర్మలు చేస్తే తగిన విధంగా శిక్షలను ఇస్తాడు. శనీశ్వరుడు సాధారణంగా చేతిలో కత్తి, విల్లుని ధరించి దర్శనమిస్తాడు. ఇవి శిక్షలకు, న్యాయాలను ఇచ్చే సామర్థ్యానికి సూచనగా భావిస్తారు. అయితే శనీశ్వరుడు కాకిపై స్వారీ చేస్తూ కనిపిస్తాడు. అయితే శనిదేవుడికి ఒకటి కాదు 9 వాహనాలు ఉన్నాయి. ప్రతి వాహనానికి ఒక విశిష్టత ఉంది. పురాణాల ప్రకారం శనీశ్వరుడి వాహనం అయిన కాకి ఆధ్యాత్మిక జీవుల్లో ఒకటి. ఇది ప్రమాదాన్ని సులభంగా పసిగట్టడమే కాకుండా.. తాను ఎక్కడ నివసించినా ఆ పరిసరాలు అందంగా ఉండేలా చూస్తుంది. ఆనందాన్ని ఇస్తుంది. శనీశ్వరుడి అనుగ్రహం వల్ల కాకులు ఎప్పుడూ అనారోగ్యం బారిన పడవని కూడా నమ్మకం.


కాకి శనీశ్వరుడు వాహనం ఎలా అయింది?

హిందూ పురాణాల ప్రకారం సూర్యుడి భార్య సంధ్య . సూర్యుడి వేడిని తట్టుకోలేక తన నీడను సృష్టించి ఛాయ అనే పేరుతో సూర్యుడి సేవకు వినియోగించి తపస్సు చేయడానికి వెళ్ళింది. సంధ్య తన ఇద్దరు పిల్లలైన యమ, యమునా దేవిని ఛాయకు అప్పగించింది. సంధ్య తపస్సు ముగిసే సమయానికి ఛాయ .. సూర్యుడులకు శనీశ్వరుడు జన్మించాడు. ఈ విషయం సంధ్యకు తెలియగానే ఆమె చాలా కోపం వచ్చింది. సూర్య దేవుడుకి అసలు విషయం తెలిసి ఛాయను, శనీశ్వరుడిని విడిచిపెట్టాడు. సంధ్య , సూర్యుడుల ప్రవర్తనకు విచారంతో.. ఛాయ శనీశ్వరుడుతో కలిసి అడవికి వెళ్ళింది. ఛాయ.. శనీశ్వరుడు అడవిలో నివసిస్తున్నారని తెలుసుకున్న సూర్యుడు, వారిద్దరినీ చంపడానికి అడవికి నిప్పంటించాడు. ఆ తర్వాత ఛాయ నీడగా మారి మంటల నుండి తప్పించుకుంది. అయితే శనీశ్వరుడు మంటల్లో చిక్కుకున్నాడు. అంతేకాదు శనీశ్వరుడుతో కలిసి అడవుల్లో నివసిస్తున్న వారు మరణించారు. ఈ సమయంలో ఒక కాకి ఆ మంటల నుండి శనీశ్వరుడిని బయటకు తీసింది. అప్పటి నుంచి కాకి శనీశ్వరుడికి ఇష్టమైనదిగా మారింది. ఆ తర్వాత కాకిని తన వాహనంగా చేసుకున్నాడు. ఒకరోజు కాకి శనిదేవునితో కలిసి కాకిలోకం చేరుకుంది. కాకి తల్లి శనీశ్వరుడిని తన కొడుకు అని సంబోధించి ప్రేమ, ఆప్యాయతలను పంచింది. కాకి తన తల్లిని శనీశ్వరుడు కూడా తమ ఉంచుకుందామని కోరతాడు. దీంతో శనీశ్వరుడు తన ఉంచుకుని ప్రేమగా చూసుకుంటుంది. అనంతరం శనిదేవుడు కాకిని తన వాహనంగా చేసుకున్నాడు.



## శ్రీమహావిష్ణువుకే వరమిచ్చిన మధుకైటభుల పురాణగాథ

ముక్కోటి ఏకాదశి ఇవాళే. ఏటా మార్గశిర మాసం శుక్లపక్షంలో ఇది వస్తుంది. యోగనిద్ర నుంచి మేల్కొన్న శ్రీమహావిష్ణువును ప్రాతః కాల సమయంలో ముక్కోటి దేవతలు వైకుంఠానికి చేరుకొని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునే పుణ్య సమయం కాబట్టి దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చింది. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లోనూ ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రమైనది. అన్ని ఏకాదశులను పాటించడం కుదరని వారు, కనీసం ఈ రోజైనా ఆచరించాలి. ఎందుకంటే ఇవాళ ఏకాదశి వ్రతాన్ని పాటిస్తే మోక్షం లభిస్తుందని నమ్ముతారు. భక్తులకు మోక్షాన్ని ఇచ్చే ఏకాదశి కాబట్టి ఈ రోజును మోక్షదా ఏకాదశి అని కూడా పిలుస్తారు. శ్రీప్రశ్న సంహిత అనే గ్రంథంలో ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి నియమాలు ఉన్నాయి. ఆ నియమాల ప్రకారం స్వామిని దర్శించుకోవడం ద్వారా మోక్షప్రాప్తి లభిస్తుందని పండితులు చెబుతారు. ఇవాళ విష్ణు ఆలయాల్లో, వైకుంఠధామంలో ఉన్న శ్రీమన్నారాయణుడిని ఉత్తర ద్వారం నుంచి వెళ్లి భక్తులు దర్శించుకుంటారు. ఇవాళ శ్రీమహావిష్ణువు చిత్రపటానికి తులసీదళాలు, జాజిపూలు, పారిజాతాలు, మందారం వంటి పూలతో అలంకరించి ప్రాతఃకాలమే పూజ చేసుకోవాలి. పూజలు ధూప, దీపాలను సమర్పించి ఆవుపాలతో చేసిన పాయసాన్ని నైవేద్యంగా పెట్టాలి. అరటి పండ్లు నైవేద్యం పెట్టినా సరిపోతుంది. స్వామికి పచ్చ కర్పూరం వెలిగించి హారతి ఇవ్వాలి. ఈ రోజంతా ఉపవాస దీక్షను ఆచరించాలి. శరీరం సహకరించని వారు పాలు, పండ్లు తీసుకుని ఉండవచ్చు. కానీ అన్నం మాత్రం తినకూడదు. ఇంట్లో విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం ఈరోజు చేస్తే చాలా విశేషమైన ఫలితం వస్తుంది. ఇక ఇది వీలుపడని వారు గోవింద నామాలు చదువుకున్నా ఫలితం ఉంటుంది.పురాణాల ప్రకారం.. మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులతో శ్రీ మహావిష్ణువు యుద్ధం చేస్తారు. కానీ గెలవలేని పరిస్థితి వస్తుంది. అప్పుడు మీకు ఏం వరం కావాలో కోరుకోమని స్వామి వారిని కోరుతారు. వారు గర్వంతో.. మాకు నువ్వు వరం ఇచ్చేదేంటి.. మేమే నీకు ఇస్తాం, కోరుకో అంటారు. దాంతో స్వామి వారిద్దరినీ తన చేతిలో చనిపోవాల్సిందిగా వరం కోరతారు. అందుకు ఆ రాక్షసులు ఒప్పుకొని చనిపోతారు. అలా మాట నిలబెట్టుకున్నందుకు వారిని స్వామి.. ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠధామంలోకి పంపిస్తారు. అలా లోపలికి వెళ్లిన వారు మంచివారిగా మారిపోతారు. దాంతో తమకు కలిగిన భాగ్యాన్ని అందరికీ కల్పించాలని ఆ రాక్షసులు కోరతారు. అందుకు స్వామి ఒప్పుకుంటారు.



## ఈ వస్తువులను రహస్యంగా దానం చేస్తే చాలు అంతులేని సంపద మీ సొంతం?

మామూలుగా దానధర్మాలు చేయడం వల్ల ఎన్నో రకాల ఫలితాలు లభిస్తాయని పండితులు చెబుతూ ఉంటారు. మనకు ఉన్నంతలోనే వస్త్రదానం, అన్నదానం, డబ్బు దానం లాంటివి చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని చెబుతూ ఉంటారు.అందుకే ఆలయాల దగ్గర గుడి నుంచి బయటికి వచ్చేటప్పుడు బిక్షాటన చేసే వాళ్లకు డబ్బులను ఇస్తూ ఉంటారు. కేవలం ఆలయాల దగ్గర మాత్రమే కాకుండా రోడ్డుపై ఎక్కడైనా బిక్షాటన చేసే వాళ్ళు అలాగే పేద ప్రజలకు దానధర్మాలు చేయడం చాలా మంచిది. మనం ఏ ధర్మం చేసినా ఫలితం మనకే కాదు మన తర్వాతి తరానికి కూడా దక్కుతుందని పెద్దలు చెబుతారు. అయితే, హైందవ ధర్మంలో సాధారణ దానాల కంటే రహస్యంగా చేసే గుప్త దానాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. మనం దానం చేసే విషయం దానం చేస్తున్న విషయం ఎవరికీ చెప్పకుండా రహస్యంగా దానం చేయడం వల్ల మరిన్ని మంచి ఫలితాలు కనిపిస్తాయని చెబుతున్నారు. కొందరు దానం చేసి పదిమందికి చెప్పుకుంటూ చాలా గొప్పగా గర్వంగా ఫీల్ అవుతూ ఉంటారు. అలా చేయడం వల్ల దానం చేసిన ఫలితం కూడా దక్కదు. కానీ రహస్యంగా దానం చేయడం వల్ల దురదృష్టం కూడా అదృష్టంలా మారి లక్ష్మీ అనుగ్రహం తప్పక కలుగుతుంది. మరి అలా ఎటువంటి వస్తువులను రహస్యంగా దానం చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వేసవికాలంలో పండ్లను రహస్యంగా దానం చేయడం వల్ల మంచి జరుగుతుంది. అయితే కట్ చేసిన పండ్లను కాకుండా ఫ్రెష్ గా దొరికే పండ్లను తీసుకొని పేదలకు బిక్షాటన చేసే వాళ్లకు దానం చేయడం మంచిది. సంతానం కావాలనుకునే వారు వేసవిలో రహస్యంగా పండ్లను దానం చేయాలి. అదేవిధంగా వేసవికాలంలో మంచినీటిని దానం చేయడం వల్ల దాహం తీర్చినట్లు అవుతుంది. దాంతో భగవంతుడి అనుగ్రహం తప్పకుండా కలుగుతుంది. భగవంతుడు సంతోషించి మీపై కరుణ కటాక్షాలు చూపుతాడు. వేసవి కాలంలో మట్టి కుండ లేదా శీతల పానీయం దానం చేయాలి. ఇది చాలా పుణ్యాన్ని ఇస్తుంది. మన సంస్కృతిలో బెల్లం దానం చేయడానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రహస్యంగా బెల్లం దానం చేయడం వల్ల జాతకంలో సూర్యుని స్థానం బలపడుతుంది. ఎండాకాలంలో శనగలు తినడం మంచిది. అటువంటి పరిస్థితిలో, వేసవి కాలంలో శనగలను రహస్యంగా దానం చేస్తే రెట్టింపు ఫలితం దక్కుతుంది. దీనితో పాటు, ఒక వ్యక్తి జాతకంలో బృహస్పతి స్థానం బలహీనంగా ఉంటే, అతను శనగలను రహస్యంగా దానమివ్వాలి. అటువంటి పరిస్థితిలో, పెరుగును రహస్యంగా దానం చేయడం కూడా ఈ సీజన్‌లో శుభప్రదంగా పరిగణిస్తారు. తియ్యటి పెరుగు రహస్యంగా దానం చేయడం ద్వారా జాతకంలో శుక్ర గ్రహం స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

# పెరగని మహిళా ప్రాతినిధ్యం

మహిళలను జాతి నిర్మాతలుగా మలచడానికి, నారీ శక్తిని గౌరవించడానికి ప్రధాని మోడీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో ఆమోదించారని, గత ఏడాది సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపోయే ప్రచారం జరిగింది. పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం పార్లమెంటు, శాసనసభ ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అనేది 2026లో జాతీయ జనాభా గణన పూర్తయి, పార్లమెంటు స్థానాల పునర్వ్యవస్థీకరణ (డి-లిమిటేషన్) పూర్తయిన పిదప అమలులోకి వస్తుంది. అంటే 2029లో మాత్రమే అది అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఏదైనా కారణాల వల్ల ఈ డెడ్‌లైన్ మిస్ అయితే 2034లో జరగబోయే ఎన్నికల వరకు మహిళా రిజర్వేషన్ అమలయ్యే పరిస్థితి లేదని మనం అర్థం చేసుకోవాలి.

ఇటీవల జరిగిన 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎప్పటి మాదిరిగానే మహిళా సభ్యుల ప్రాతినిధ్యం తీసికట్టుగానే ఉంది. ఇంకా చెప్పాలంటే తగ్గింది. 74 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యారు. ఇది మొత్తం పార్లమెంట్ సభ్యుల్లో 13.6 శాతం మాత్రమే. 2019లో 78 మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఇది 14.4 శాతంగా ఉంది. గత ఎన్నికల్లో 726 మంది మహిళలు పోటీ చేయగా, 2024 ఎన్నికల్లో పోటీ చేసినవారి సంఖ్య 797కి పెరిగింది. అయినా ఎన్నికయిన మహిళా పార్లమెంట్ సభ్యుల సంఖ్య తగ్గడం గమనార్హం.

ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విషయం మనకు తెలిసిందే. రాష్ట్రాలలో శాసనసభలకు జరిగే ఎన్నికల సందర్భంగా, మహిళలకు ప్రత్యేకంగా కొన్ని సంక్షేమ పథకాలను కూడా రాజకీయ పార్టీలు ప్రకటిస్తూ ఉంటాయి. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల లాగే, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అనేక పార్టీలు తమ మ్యానిఫెస్టోలలో ప్రత్యేక పథకాలను పొందుపరిచాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిషా ఎన్నికలలో పాలక, ప్రతిపక్ష పార్టీలు మహిళలే కేంద్ర బిందువుగా అనేక పథకాలు తీసుకువచ్చాయి. వీటన్నింటి ప్రభావం ఎన్నికల్లో ఉంటుందని, ఓట్లు వేయడానికి మహిళా ఓటర్లు పోటెత్తుతారని అందరూ భావించారు. కానీ విపరీతమైన ఎండ తీవ్రత, ఓటింగ్ పట్ల నిరాసక్తత వంటి కారణాలతో ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో దేశవ్యాప్తంగా 67.01 శాతం పురుషులు ఓట్లేయగా, 67.18 శాతం మహిళలు ఓట్లేశారు. ఈ ఎన్నికలలో 65.08 శాతం పురుషులు ఓట్లేస్తే, 65.78 శాతం మాత్రమే మహిళా ఓటింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు ఓట్లేసినప్పటికీ, గతంతో పోలిస్తే దాదాపు 2 శాతం మహిళా ఓటింగ్ తక్కువ నమోదవడం గమనార్హం. అస్సాం, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో మాత్రం 80 శాతం పైబడి మహిళా ఓటింగ్ నమోదైంది. 2023లో ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపియు) సమాచారం మేరకు ప్రపంచ వ్యాప్తంగా 27.6 శాతం మహిళలు పార్లమెంటు సభ్యులుగా



గెలుపొందారు. ఈ విషయంలో 185 ప్రపంచ దేశాల్లో భారత్ స్థానం 143గా ఉంది. ఈ ఏడాది ఎన్నికలు జరగడానికి ముందు మన దేశ పరిస్థితి ఇది. ఈ ఎన్నికల తర్వాత, మన దేశ స్థానం ఇంకా దిగజారే ప్రమాదం ఉంది. ఫిన్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, స్వీడన్ దేశాలు ఎప్పుడో మహిళా సమానత్వాన్ని సాధించాయి. అక్కడి ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు మహిళలే. మన పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం అంతంత మాత్రంగా ఉంటే, అనేక దేశాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ మధ్యే మెక్సికోలో మొట్టమొదటి సారిగా ఓ మహిళ అధ్యక్ష పీఠానికి ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానం కోసం పోటీ పడిన ఇద్దరు అభ్యర్థులూ మహిళలే కావడం విశేషం. ఇదేదో ఒక రోజులో జరిగింది కాదు. మెక్సికో కూడా లిబరల్ దేశమేమీ కాదు. అక్కడ కూడా ఛాందసవాద శక్తులు, గుత్త పెట్టుబడిదారీ శక్తులు వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉన్నాయి. అయితే, వీటిపై పురోగామి శక్తులు, ఫెమినిస్టులు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తూనే ఉన్నారు. దాని ఫలితమే ప్రస్తుతం మెక్సికోలో కొన్ని సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయి.

మన దేశంలో పార్లమెంటరీ రంగంలోనే కాదు%ౌ%నిర్ణయాత్మక రంగాలలోనూ మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. దేశం అనుకున్న రీతిలో అభివృద్ధి చెందడానికి ఇది ప్రధాన అవరోధంగా ఉంది. 1947లో దేశ మొత్తం అక్షరాస్యత కేవలం 12 శాతం ఉండగా నాడు మహిళల్లో అక్షరాస్యులు 6 శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అక్షరాస్యత 77.7 శాతం ఉండగా మహిళలది 70.3 శాతంగా నమోదైంది. పురుషులతో పోలిస్తే మహిళల అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. 1957లో కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలు చేసింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం కూడా భారీగా భూ సంస్కరణలు అమలు చేసింది. మిగులు భూమిని పేద ప్రజలకు ఇవ్వబడింది. తినడానికి ఆహారం, చదువుకోవడానికి విద్య ప్రజలకు లభించింది. అందుకే మానవాభివృద్ధిలో మొదటి స్థానం కేరళ రాష్ట్రానిది. 100 శాతం అక్షరాస్యత సాధించబడింది. ఈ నిర్ణయాల వల్ల కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మహిళల స్థితిగతులు గణనీయంగా పెరిగాయి. 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా మహిళలకు అన్ని స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. తర్వాత 2002లో పట్టణ స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని మరోసారి సవరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో పంచాయతీల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఫలితంగా వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. మరోవైపు చూస్తే%ౌ%చదువు, అవకాశాల్లో ఆడపిల్లల పట్ల వివక్ష, భ్రూణ హత్యలు, అత్యాచారాలు దేశంలో ఏదో మూలన నిత్యం జరుగుతూనే ఉన్నాయి. స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా పోరాటం తప్పడం లేదు. అసంఘటిత రంగాలలో మహిళలు వారి కనీస సదుపాయాల కోసం నిత్యం పోరాటం చేయాల్సి వస్తుంది. మణిపూర్‌లో కుకీ ప్రజలపై జరిగిన దాడులు, మహిళలపై జరిగిన అత్యాచారాల ఘటనలపై విచారం వ్యక్తం చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని, సుప్రీంకోర్టు హెచ్చరిక చేసేవరకు కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. మన దేశంలో పురుషాధిక్య ధోరణి, లైంగిక అణచివేత పోవాలంటే చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. దీనితో పాటుగా రాజకీయాల తీరుతెన్నులు మారాలి. పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన పార్లమెంట్ సభ్యులలో 93 శాతం మంది కోటీశ్వరులని, అనేకమంది ఎంపీలకు నేర చరిత్ర ఉందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ తెలియచేస్తోంది. ధనమయ, నేరమయ రాజకీయాలు రూపుమాపకుండా పురోగామి, మహిళాభ్యుదయ రాజకీయాలు సాధ్యమా అనేదే ప్రశ్న? దురదృష్టవశాత్తు మహిళాభ్యుదయంలో ముందంజలో ఉన్న కేరళ రాష్ట్రం నుంచి ఒక్క మహిళా పార్లమెంట్ సభ్యులు కూడా ఎన్నిక కాలేదు. అన్ని పార్టీలూ మహిళలను నిలబెడితేనే మహిళా ప్రాతినిధ్యం సాధ్యం. కనుక పార్లమెంట్‌లో, చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచే మహిళా చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి. ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో ముందుకు వచ్చే వామపక్ష, అభ్యుదయ శక్తులను ప్రజలు ఆదరించాలి. మతవాద, చాందసవాద రాజకీయ శక్తులను ఓడించాలి. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడే, ప్రత్యామ్నాయ శక్తుల రాజకీయ ప్రాబల్యం పెరిగితేనే నిజమైన మహిళాభ్యున్నతి, మహిళా సాధికారత సాధ్యం అవుతుంది.

# గెలిచింది ప్రజల ఆలోచనలే!

బీజేపీ పట్ల దేశమంతా ఎంత వ్యతిరేకత కనిపించినప్పటికీ మరోమారు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం వెనుక ఉన్న కారణాలు ఏవైనా, ఎన్నికల ప్రక్రియ మాత్రం పారదర్శకంగా జరిగినట్లు కనిపించలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సెక్యులరిజం, ఫాసిజంకు మధ్య ఎన్నికలు అన్నట్టే జరిగింది తప్ప ప్రజాస్వామ్యం కోసం జరిగినట్టుగా లేదు. ఎగ్జిట్ పోల్స్ కన్నా ప్రజల స్వంత అంచనాలు ఫలితాలకు దగ్గరగా ఉన్నాయనడంతో అతిశయోక్తి లేదు, రెండు రోజుల సంతోషం కోసం మీడియా, వివిధ సర్వే సంస్థలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి దోహదం చేశాయా? లేక వాళ్ళ అంచనాలకు మించి ప్రజల తీర్పు వచ్చిందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎట్టకేలకు ఎన్నికల ప్రస్థానం ముగిసింది. పోటాపోటీ ప్రచార ఘట్టాలతో, చిత్ర విచిత్రమైన హావభావాలతో కూడిన మాటల యుద్ధంతో, విద్వేషపూరిత ప్రసంగాలతో ఏడు దశల సుదీర్ఘ ప్రణాళికలతో ఎన్నికల నిర్వహణ ముగిసింది. ఇక ప్రసంగాల్లో 400 సీట్లు లక్ష్యంతో దిగిన బీజేపీ అసలు ఉద్దేశం ఏంటి అన్న చర్చ తీవ్రంగా జరగడం, ప్రజాసేవ చేయాలంటే ప్రతిపక్షమే ఉండొద్దని అనుకోవడంలో కారణాలు ఏంటి అనే అంశాన్ని ప్రతిపక్షాలు ఆయుధంగా మలుచుకోవడంలో విజయం సాధించడం, విద్వేషపూరిత ప్రసంగాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పబ్బం గడుపుకోవాలనుకోవడం అందరూ చూసిందే తప్ప పెరుగుతున్న ధరల నియంత్రణ, పేదరిక నిర్మూలన, విద్య, ఉపాధి తదితర ప్రజలకు ఉపయోగపడే ప్రస్తావనలు రాకపోవడం శోచనీయం. ఎన్నికల ప్రచార సమయంలో రాజ్యాంగ పరిరక్షణ అంటూ ఒకరు, అభద్రతాభావం అంటూ ఇంకొకరు... ఇవన్నీ పరోక్ష బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలే అనిపించాయి తప్ప సేవా రాజకీయాల వలే అనిపించలేదు. ఇకపోతే ఎలక్షన్ కమిషన్‌లో త్రిసభ్య కమిటీలో జ్యుడిషియరీ ప్రమేయం తొలగించిన నుండి మొదలు.. ఏడు దశల ఎన్నికలు అంటూ కొన్ని రాష్ట్రాల్లో అయితే అక్కడున్న మొత్తం సీట్లని ముక్కలుగా చేసి ఒక్కో దశలో కొన్నింటికీ చొప్పున ఒకే రాష్ట్ర ఎన్నికలు ఏడు దశల్లో జరగడం విశేషం, లక్షలాది ఓట్లు గల్లంతైన సంఘటనలు కోకొల్లలు. గెలుపు నీదా - నాదా అన్నట్టే ఉంది కానీ ప్రజల సమస్యలకు స్పందించటం, ప్రజాస్వామ్య విలువలు కాపాడుకోవడం అనేది ఎక్కడా కనపడలేదు. ఎగ్జిట్ పోల్స్‌కు ముందే ఎంతోమంది మేధావులు, అనలిస్టులు సోషల్ మీడియా చానళ్ల ద్వారా ఫలితాల అంచనాలు ముందే వెల్లడించడం, ఇరుపార్టీల ప్రచార వ్యూహాలకు అనుగుణంగా మార్చుకోవడం లాంటివి ఎన్నో చూశాం ఈ ఎన్నికల్లో! ఇక మన తెలుగు రాష్ట్రాలలోని ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఏకపక్షంగా విజయం సాధించడంలో సర్వత్రా హర్షం వ్యక్తం అవడానికి జగన్ చేసిన పరిపాలన తప్పిదాలు ప్రధానం. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తాను నాకు ఓటేస్తే చాలు అనే గుడ్డి నమ్మకంతో ప్రజల్లోకి వెళ్లడం, రాజధాని విషయంలో అభాసుపాలు కావడం, పోలవరం ముందుకు సాగకపోవడం, ప్రాజెక్టులు లేవు, ఉపాధి లేదు తదితర పలు అంశాలు జగన్ ఓటమికి కారణాలు అని చెప్పవచ్చు. తెలంగాణ విషయానికి వస్తే లిక్కర్ అంశంలో కవిత జైలు పాలు కావడం, ఫోన్ ట్యాపింగ్ గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి లాంటివి బీఆర్ఎస్‌కు ప్రతికూలమం కావడం వల్ల కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది, డిపాజిట్లు కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఇదంతా వాళ్ల స్వయంకృతాపరాధం. ఇక తెలంగాణలో ఓటు శాతం తగ్గడానికి కారణం ఇక్కడ ఉన్న సెటిలర్లు ఆంధ్రలోని తమ స్వంత గ్రామాలకు వెళ్లి అక్కడ ఓటింగులో పాల్గొనడం. ఇది హైదరాబాద్, దాని చుట్టుపక్కల లోక్ సభ స్థానాల్లో పోటీ చేసిన వారిపై తీవ్ర ప్రభావం చూపించింది. ఒక వ్యక్తి ఒక అసెంబ్లీ ఒకే ఓటు అన్న నియమానికి ఉల్లంఘన జరిగింది. డిజిటల్ ఇండియాగా చెప్పుకునే మనదేశంలో ఎలక్షన్ కమిషన్ ఈ విషయాన్నీ దృష్టిలోకి తీసుకోకపోవడం గమనార్హం. ఆధార్‌తో పాన్ కార్డు అనుసంధానం చేసిన ప్రభుత్వం ఓటరు కార్డును ఆధార్‌తో లింక్ చేయకపోవడం వెనక కారణాలు ప్రభుత్వానికే వదిలేయాలి. గెలుపు ఓటములు ఏ ఎన్నికల్లో అయినా సర్వసాధారణం కానీ రాజకీయంగా మాత్రమే కాకుండా నైతికంగా కూడా గెలిచామా లేదా అన్నది నాయకులు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఓడినవాళ్లకు ఎలాగూ పాదయాత్ర, బస్సు యాత్ర లాంటివి ఎన్నో ఉన్నాయి, గెలిచిన వాళ్లు ఎలాగూ టైం ఉండదు పైగా పెట్టిన పెట్టుబడి రాబట్టుకునే తంతులో బిజీగా ఉంటారు.

# కుటుంబానికి నాన్నే వెన్నెముక!



కుటుంబ వృక్షానికి కనిపించే కాండం అమ్మ అయితే కనిపించని తల్లి వేరు నాన్న. కుటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న. సంతానాభివృద్ధికి మార్గదర్శే కాదు విలక్షణ కథానాయకుడు కూడా నాన్నే. కుటుంబ గౌరవ జ్యోతి ప్రజ్వలకర్త నాన్న. పుస్తకజ్ఞానం లేకపోయినా లోకరీతిని చదివిన మేధావి నాన్న. తన భుజాలు వంశ భారాన్ని మోసే వాహనాలు. కుటుంబ దేహానికి నాన్నే వెన్నెముక. అమ్మతో కలిసి అమృతాన్ని వితరణ చేసే పితృదేవులు నాన్న. నాన్న ఓ ఆత్మీయ నేస్తం, అవసరాల్ని తీర్చే హస్తం. దారితప్పిన పిల్లల్ని సన్మార్గంలో పెట్టి, వారి మనసులో ప్రతినాయకుడైయ్యేది నాన్నే. తన జీవితం కుటుంబానికే రక్షణ కవచం. తండ్రి త్యాగం అనన్య సామాన్యం. పిల్లల కంటికి రెప్ప పిత. బోధనలో గురువు, సాధనలో అనంత శక్తిమంతుడు. నాన్న చెమటే ఇంటి దీపపు చమురు. తడబడినపుడు తనో ఊతకర్ర, బెదిరినపుడు తనో కొండంత ధైర్యం. సన్మార్గ సందేశమే ఆయన అభిమతం. తండ్రి మనసు దూదంత మెత్తన, పాల నురగంత తెల్లన, వెన్నెలంత చల్లన. కుటుంబ లతకు పందిరి నాన్న. ఎదిగే సంతాన మొక్కలకు తనో ట్రీగార్డు. నాన్న శ్వాస కుటుంబ సంక్షేమం. కుటుంబ కాయానికి ప్రాణవాయువు, గాయానికి లేపనం నాన్న. తను కరుగుతూ వెలుగులు చిమ్మే కొవ్వొత్తి నాన్న. నాన్న బతుకు కష్టాలమయం, కుటుంబహితం. ప్రేమల ఊట బాయి, అనురాగాల అక్షయపాత్ర నాన్న. తనువు అలిసి సొలిసినా కుటుంబ నవ్వులతో శక్తిని పుంజుకొని బేషరతుగా సర్వస్వం దారబోసే నాన్న జీవితం మహోన్నత ఆదర్శ దీపస్తంభం. పిల్లల పెంపకంలో తనో పరిపాలనాదక్షుడు, అవసరమైతే ఆయనే చండశాసనుడు. అమ్మ జన్మనిస్తే, నాన్న జీవితపరమార్థాన్ని ప్రసాదిస్తాడు. అమ్మ తొలి అడుగు వేయిస్తే, నాన్న ప్రగతి పథం చూపుతాడు. అమ్మ తొలి పలుకు నేర్పితే, నాన్న జీవిత పాఠాల సుభాషితాలు నూరి పోస్తాడు. నాన్న లేనిదే సంతానం లేదు. కుటుంబ పోషణకే తన జీవితం అంకితం. అమ్మనాన్నల అన్యోన్యతే పిల్లల సుఖసంతోషాల కోవెల. ఆది గురువు అమ్మ అయితే లోకజ్ఞాన బోధకుడు నాన్న. మన జీవితాల్లో నాన్న స్థానం భర్తీ చేయలేని అద్వితీయ, నిరుపమాన పాత్ర. కొడుకులకు తనో దారి దీపం. కూతురుకు నాన్నంటేనే పంచప్రాణం. నాన్న లేని ఇల్లు గాఢాంధకారం. చీకట్లను పారద్రోలే రవి కిరణమే నాన్న. కుటుంబ పుస్తకంలో నాన్నే భావాక్షరం. జీవితాక్షరాలకు నాన్నేగా అర్థాలు బోధపరిచే జ్ఞానం. నాన్న పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. తండ్రి త్యాగానికి తత్సమానం లేదు. తండ్రి మది సమస్యల సుడిగుండం. తండ్రి కంటికి కునుకు కరువు. తండ్రి తపన హిమవత్పర్వతం. పురుషుడి జన్మకు సంపూర్ణార్థం నాన్న అవడమే. పిల్లల రెక్కలకు ఎగరడం నేర్పే నైపుణ్య జీవి నాన్న. నవ్వుల పరదాల వెనక బాధలను కప్పేసి, కన్నీళ్లను చెమటగా మార్చి తనవారిని గుండెల్లో పెట్టుకొని సాదుకునే నాన్న హృదయం ఎవరెస్టంత ఉన్నతం, సాగరమంత వైశాల్యం. త్యాగానికి నిలువెత్తు సాక్ష్యం తండ్రి. నాన్న ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా జూన్ 3వ ఆదివారం, అనగా 16 జూన్ 2024న 'ప్రపంచ పితృ దినోత్సవం' నిర్వహించుట జరుగుతుంది. మన హిందూ సమాజంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండడంతో అమ్మనాన్నల నేతృత్వంలోనే కుటుంబ ప్రగతి రథం కదులుతుంది. కుటుంబ బండికి రెండు చక్రాలుగా అమ్మానాన్నలు నాయకత్వం వహిస్తారు. పిల్లల బతుకు పయనం ఈ బండిలోనే మొదలవుతుంది. మన సంప్రదాయంలో అనునిత్యం పితృదినోత్సవమే. పాశ్చాత్య దేశాల్లో మాత్రం యవ్వనం ప్రవేశించగానే రెక్కలొచ్చిన బిడ్డలు గూటి నుంచి నిష్క్రమించి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తారు. అలాంటి సంస్కృతిలో తండ్రితో కొన్ని క్షణాలు గడపడానికి పితృ దినోత్సవం అనే వేదిక వారికి ఉపయోగపడుతుంది. నేటి భారతీయ యువత ఆధునిక పోకడల పేరుతో అమ్మనాన్నలను ఆదరించకుండా నిర్లక్ష్యం చేస్తూ అనాథలుగా మార్చడం అమానవీయం, ఆక్షేపణీయం. పితృ దినోత్సవం వేదికగా నాన్నకు కృతజ్ఞతలను తెలపడం, పుష్పగుచ్ఛాలను అందించడం, మధుర క్షణాలను సంతోషంగా గడపడం, కానుకలు సమర్పించడం, నాన్న దీవెనలు పొందడం జరుగుతుంది. బాధ్యతల వలలో చిక్కినా, నిబ్బరంగా కనిపిస్తూ, సవాళ్ళను అధిగమిస్తూ, కన్నీళ్లను దిగమింగుతూ, రక్తాన్ని చెమటగా మార్చగల ధన్యజీవి నాన్న. నాన్న రుణం తీర్చుకోలేనిది. నాన్న అయిన తరువాతే పురుషుడికి నాన్న హృదయం ఆవిష్కృతం అవుతుంది. వృద్ధాప్యంలో నాన్న సంతోషానికి కారణం పిల్లల ఉన్నతి. వృద్ధాప్యంలో నాన్నకు మనందరం కృతజ్ఞతాపూర్వకంగా ఊతకర్రలం అవుదాం. తన రుణాన్ని తీర్చుకునే అవకాశాల్ని నిరంతరం చేజిక్కించుతుందాం. మన ముందు కదిలే దేవతలుగా అమ్మనాన్నలను ఆరాదిద్దాం. నాన్న సంతోషానికి కారణమవుతూ, దీవెనలు పొందుతూ, సదా కృతజ్ఞతలు తెలుపుతూ ఉందాం. నాన్నే హీరో, తను లేని జీవితం జీరో. అమ్మనాన్నలు నిర్మించిన హద్దులు లేని ప్రేమ సామ్రాజ్యంలో స్వేచ్ఛగా, బాధ్యతగా ఎగరడం నేర్చుకుందాం, వారి దీవెనలతో శక్తి నింపుకుందాం. తల్లితండ్రులకు పాదాభివందనాలు సమర్పిద్దాం.

## తెలుగు రేడియో తొలి ప్రవక్త

ఆచంట జానకిరాం సుప్రసిద్ధ రేడియో ప్రసార ప్రముఖులు, రచయిత. చిత్రకారులు. జానకిరామ్ 1903 జూన్ 16న జన్మించారు. ఆయన సుప్రసిద్ధ సంఘ సేవకురాలు, ఆచంట సీతమ్మ, వైద్యులు ఆచంట లక్ష్మీపతి కుమారులు. ఆయన బాల్యం అంతా మద్రాసులో గడిచింది, అడయార్ లో మొదటి యుద్ధం రోజుల్లో కొంత కాలం మదనపల్లిలో విద్యాభ్యాసం. ఆ రోజుల్లోనే అక్కడ స్కూల్ ప్రిన్సిపాల్ గా ఉన్న జేంసు కజిన్సు శిష్యరికం. కజిన్సు జానకిరామ్‌కి చిత్ర కళలో అభిరుచి కల్పించారు. వారి సాంగత్యంలో తనెన్నో విషయాలు నేర్చుకున్నానని జానకిరామ్ తెలియజేశారు. ఆయనకు దువ్వూరి రామిరెడ్డి, అడవి బాపిరాజు లను పరిచయం చేసింది కూడా కజిన్సే. ఆ రోజుల్లోనే హోమ్ రూల్ నాయకులు అనీ బిసెంట్ అరండేల్ ల ప్రభావం పడింది. మదనపల్లి లో ఉండగానే అక్కడికి వచ్చిన రవీంద్రుడ్ని దగ్గరగా చూసే భాగ్యం కలిగింది. తండ్రి ఆచంట లక్ష్మీపతి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సంఘ సంస్కర్త. వారి పెంపకంలో జానకిరామ్‌కి ఉత్తమ సంస్కారం పుణికి పుచ్చుకున్నారు. రాజకీయ, సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కుటుంబం అవటం వల్ల ఆ ప్రభావాలన్నీ ఆయన మీద ఉన్నాయి. చిన్నప్పట్నించీ సమకాలిక మహావ్యక్తుల పరిచయ భాగ్యం లభించింది. వీరేశలింగం, గురజాడ, ఉన్నవ లాంటి సంస్కర్తలు, రచయితలు తన తండ్రితో ఇష్టాగోష్టి జరుపు తున్నప్పుడు వినే అదృష్టం కలిగింది. అడయార్ లో బి. ఎస్సీ. అయ్యాక వారు కొంత కాలం విజయనగరం లో, బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో రసాయన శాస్త్ర పరిశోధనలు చేశారు. బెంగుళూరు పరిశోధనా జీవితం తర్వాత ఇన్స్యూరెన్సు కంపెనీ కార్యదర్శిగా బెజవాడ కేంద్రంగా పని చేశారు. ఆ రోజుల్లోనే ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ లోని కవి పండితులందరితో పరిచయం, స్నేహం పెరిగాయి. ఉద్దండుల్కెన కవులు, గాయకులు, తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, అన్ని రంగాల్లోని నిష్ణాతులతో మైత్రి ఏర్పడ్డమే కాక వారి ప్రేమానురాగాలు పొందారు. ఆ రోజుల్లోనే బసవరాజు అప్పారావు తో పరిచయం కలిగింది. కవి స్వంత గొంతుకలో ఆయన రాసిన గీతాలు విన్నారు. ఆ తర్వాత ఈ పాటలు టంగుటూరి సూర్యకుమారి ఆలాపించారు. అలాగే కృష్ణశాస్త్రి, వేదుల, అబ్బూరి, చలం లతో ప్రగాఢ మైత్రి ఏర్పడింది. 1935 భారత దేశం లో రేడియో ప్రసారాలు ప్రారంభమ్కెన కొత్తలోనే రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరారు. రేడియోలో పని చేసే రోజుల్లో బుచ్చిబాబుతో పరిచయం, స్నేహం పెరిగాయి. 1938 జూన్ 16 న మదరాసులో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా ఆచంట జానకిరాం చేరారు. తొలి డైరక్టర్ జనరల్ లైనల్ ఫీల్డెన్ నియమించిన తొలి తరం వారిలో ఆచంట ఒకరు. సున్నితమైన మనస్సు, తెల్లని దుస్తులు ధరించి కార్యక్రమ రూపకల్పనలో మేటి అనిపించుకున్నారు జానకిరాం. మదరాసు కేంద్రం నుండి తొలి తెలుగు నాటకం ' అనార్కలి ' జానకిరాం ప్రయోక్తగా వెలువడింది. కొంతకాలం ఢిల్లీలో దక్షిణ భారత ప్రసారాల విభాగంలో పని చేశారు. తర్వాత తిరుచిరాపల్లి కేంద్రంలో ప్రొగ్రాం ఎగ్జిక్యూటివ్ గా పనిచేసి మదరాసు చేరారు. 120 పైగా తమిళ నాటకాలు మిత్రుల సాయంతో ప్రసారం చేశారు. ఆంధ్రదేశం నలుమూలల నుండి పండితులను పిలిపించి తెలుగు ప్రసంగాలు ఏర్పాటు చేశారు. 21 సంవత్సరాలు ఆకాశవాణిలో ప్రముఖ పదవులు నిర్వహించారు. వాణి ఎడిటర్ గా మదరాసు కేంద్రంలో ఒక దశాబ్దిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. జానకిరాం గొప్ప సౌజన్యమూర్తి, స్నేహశీలి, సౌమ్యుడు, భావుకుడు. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో పండితుడు.

# మెప్పించే పద్మవ్యూహంలో చక్రధారి



మెప్పించే పద్మవ్యూహంలో చక్రధారివి.సి క్రియేషన్స్ బ్యానర్ పై సంజరురెడ్డి బంగారపు దర్శకత్వంలో కే.ఓ.రామరాజు నిర్మిస్తున్న చిత్రం 'పద్మ వ్యూహంలో చక్రధారి'. ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా, శశికా టిక్కూ, అషురెడ్డి హీరోయిన్స్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకని రాయచోటిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మూవీ కాస్ట్ అండ్ క్రూతో పాటు జబర్దస్త్ నటీనటులు వినోదిని, పంచు ప్రసాద్, నాగిరెడ్డి, ఫణి, ఉప్పల్ బాలు, శాన్వి, సత్తి, రేలారే రేలా గోపాల్ పాల్గొన్నారు. వీరితో పాటు రాయచోటిలో ఉన్న ప్రముఖ డాక్టర్లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. 'రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. అలాగే తెలుగు ఇండస్ట్రీలో రాయచోటి నుంచి ఇద్దరు హీరోలు ఉన్నారు. యూత్‌ఫుల్ సినిమాలతో అలరించే కిరణ్ అబ్బవరం, అలాగే ఈ సినిమా హీరో ప్రవీణ్‌రాజ్‌కుమార్ కూడా ఇదే ప్రాంతం వాడు అయినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రవీణ్ రాజ్‌కుమార్ సైతం కిరణ్ అబ్బవరం అంత గొప్ప పేరు తెచ్చుకుంటాడని ఆశిస్తున్నాం' అని ఈ వేడుకకు విచ్చేసిన డాక్టర్లు అన్నారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'భిన్న కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేడు (శుక్రవారం) విడుదలయ్యే మా చిత్రాన్ని ప్రేక్షకులందరూ చూసి ఆదరించాలని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

## రాజమౌళి సినిమా వల్లే పేరొచ్చింది



దర్శక ధీరుడు రాజమౌళిసినిమా అంటే ఏ రేంజ్ లో క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు సాధారణంగా ఏదైనా సినిమా విడుదలైనప్పుడు ఏదో ఒక వర్గం ప్రేక్షకులకు ఆ సినిమా బాగా నచ్చేస్తూ ఉంటుంది కానీ రాజమౌళిసినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించడంలో సక్సెస్ సాధిస్తూ ఉంటుంది. ఇక కేవలం ప్రేక్షకులను మెప్పించడమే కాదు.. నిర్మాతలకు లాభాల పంట పండిస్తూ ఉంటుంది. అదే సమయంలో అటు ఇండస్ట్రీలో ఉన్న రికార్డులు అన్నింటినీ కూడా తుడిచి పెట్టేస్తూ ఉంటుంది. ఇలా ఇప్పటివరకు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి బ్లాక్ బస్టర్ విజయాలు సాధించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అందుకే ఇక జక్కన్న దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాల్లో ఒక్క ఛాన్స్ వస్తే చాలు అని మహామహా స్టార్ హీరోలు సైతం కోరుకుంటూ ఉంటారు. రాజమౌళి సినిమాలో ఒక పాత్రలో నటించారు అంటే చాలు ఇక వారికి ఊహించని రేంజ్ లో గుర్తింపు వస్తూ ఉంటుంది. అయితే తనకు కూడా ఇలా రాజమౌళిసినిమా కారణంగానే ఒక్కసారిగా గుర్తింపు వచ్చేసింది అంటూ చెప్పుకొచ్చాడు ఒక నటుడు. ఆయన ఎవరో కాదు దేవ్ గిల్. అదేనండి రామ్ చరణ్ హీరోగా నటించిన మగధీర సినిమాలో రణదేవ్ బిల్లాగా నటించి తన విలనిజంతో ఆకట్టుకున్న నటుడు. ఇటీవలే ఒక సినిమా ఈవెంట్లో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దర్శకధీరుడు రాజమౌళి వల్లే నటుడిగా నాకు మంచి గుర్తింపు వచ్చింది. 15 ఏళ్ళ క్రితమే ఆయన దర్శకత్వంలో నటించే ఛాన్స్ రావడం అదృష్టం అంటూ చెప్పుకొచ్చాడు.

## నాగశౌర్యకు షాక్ ఇచ్చిన నిర్మాణ సంస్థ..?



టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఒక మంచి గుర్తింపును ఏర్పరచుకున్న యువ నటులలో నాగశౌర్య ఒకరు. ఈయన కెరియర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రలో నటించిన ఆ తర్వాత హీరో గా కెరియర్ ను మొదలు పెట్టాడు. అందులో భాగంగా ఈయన నటించిన ఛలోసినిమా సూపర్ సక్సెస్ కావడంతో ఈయనకు మంచి గుర్తింపు తెలుగు సినీ పరిశ్రమలో లభించింది. ఇకపోతే ఈ మధ్యకాలంలో ఈయన నటించిన చాలా వరకు సినిమాలు బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొడుతున్నాయి. ఈయన వరుసగా వరుడు కావలెను , కృష్ణ వ్రింద విహారి , పలానా అబ్బాయి పలానా అమ్మాయి , రంగబలి సినిమాలతో వరుసగా అపజాయలను ఎదుర్కొన్నాడు. ఇకపోతే పోయిన సంవత్సరం విడుదల అయిన పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ అయినటువంటి రంగబలి సినిమాపై నాగ శౌర్య భారీ అంచనాలు పెట్టుకున్నాడు. అలాగే ఈ సినిమాకు అద్భుతమైన ప్రమోషన్ లను కూడా చేశాడు. మంచి అంచనాల నడుమ విడుదల ఈ సినిమాబాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఈ మూవీ కి పవన్ బాసంశెట్టి దర్శకత్వం వహించాడు. ఇక ఈ సినిమాబాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొట్టిన ఈ దర్శకుడిలో మంచి టాలెంట్ ఉంది అని గ్రహించిన నాగశౌర్య ఈయనకు మరో అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా రంగబలి సినిమాను నిర్మించిన బ్యానర్ అయినటువంటి ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్ మరోసారి నాగశౌర్య హీరోగా పవన్ దర్శకత్వంలో మరో మూవీ ని తెరకెక్కించబోతున్నట్లు వార్తలు వచ్చాయి.

## హ్యాట్రిక్ సక్సెస్




హ్యాట్రిక్ సక్సెస్‌దాదాపు 5 దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమకి, బసవ తారకం కేన్సర్ హాస్పిటల్ అధ్యక్షులుగా సేవలందిస్తూ, హిందూపురం నుంచి మూడసారి ఎం.ఎల్.ఏగా విజయం సాధించిన నందమూరి బాలకృష్ణని తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్న కుమార్, ఈసీ మెంబర్ వి.వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు), తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారితోపాటు తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి తదితరులు పుష్పగుచ్చాలతో అభినందించారు. ఏపీలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం.. ఇదిలా ఉంటే, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సమావేశం ఈనెల 26వ తేదీన విజయవాడలో జరుగనుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందే దిశగా ఈ సమావేశం కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెచ్‌ఆర్‌డి, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతున్నట్టు వాణిజ్య మండలి కార్యవర్గం తెలిపింది.

## సర్‌ప్రైజ్ చేసే యూనిక్ థ్రిల్లర్




సర్‌ప్రైజ్ చేసే యూనిక్ థ్రిల్లర్‌నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో రూపొందిన రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై అజ్మల్ ఖాన్, రేయా హరి ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, 'ఈ కథ విన్న వెంటనే చాలా బావుందనిపించింది. స్క్రిప్ట్ కోసం ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలని నేను ఇప్పటిదాక చూడలేదు. సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. ఈ సినిమాతో తెలుగులోకి వస్తున్నారు. ఖచ్చితంగా మంచి విజయం అందుకుంటారు. ఈ థ్రిల్లర్ ఖచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది. కథ, స్క్రీన్ ప్లే, యాక్షన్, యాక్టింగ్ అన్నీ అద్భుతంగా ఉంటాయి. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది' అని తెలిపారు. 'ఇదొక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇందులో ఒక యూనిక్ పాయింట్ ఉంది. అది మిమల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. టీజర్‌లో చూసిన ఎగ్జైట్‌మెంట్ సినిమాలోనూ ఉంటుంది' అని డైరెక్టర్ లోకేశ్ అజ్ల్స్ చెప్పారు. నిర్మాత రేయా హరి మాట్లాడుతూ, 'ఇది తెలుగులో నా మొదటి సినిమా. నవీన్ చాలా అద్భుతమైన యాక్టర్. ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఇది మా మూడో సినిమా. తొలి రెండు సినిమాలు బాక్సాఫీసు హిట్స్ అయ్యాయి. అవుట్ అండ్ అవుట్ యంగేజింగ్‌గా ఉంటూ అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత నిర్మాత అక్బర్ అన్నారు.

## 'నింద' సందేశాత్మక చిత్రం




సినిమాల మీద ప్యాషన్‌తో అమెరికాలో ఉద్యోగం మానేసి సినిమాను నిర్మిస్తూ దర్శకత్వం వహించాడు రాజేష్ జగన్నాథం. వరుణ్ సందేశ్‌ను మెయిన్ లీడ్‌గా పెట్టి నింద అనే చిత్రాన్ని తీశాడు రాజేష్ జగన్నాథం. ఈ చిత్రం జూన్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాంద్రకోట మిస్టరీ అంటూ తీసిన ఈ చిత్రం ఎలా ఉందో ఓ సారి చూద్దాం. బాలరాజు (ఛత్రపతి శేఖర్)కు మంజు (క్యూ మధు)ని రేప్ అండ్ మర్డర్ చేశారన్న కేసులో ఉరి శిక్ష పడుతుంది. కానీ ఆ శిక్ష వేసిన జడ్జ్ (తనికెళ్ల భరణి)కి మాత్రం అతను తప్పు చేయలేదనిపిస్తుంది. కానీ సాక్ష్యాధారాలన్నీ కూడా బాలరాజు నేరస్థుడని చెబుతాయి. దీంతో ఉరి శిక్ష విధిస్తాడు. ఇక ఆ జడ్జి కొడుకు వివేక్ (వరుణ్ సందేశ్) మానవ హక్కుల కమిషన్‌లో పని చేస్తుంటాడు. ఈ కేసు గురించి చెప్పడంతో.. అసలు నేరస్థుడ్ని పట్టుకునేందుకు బయల్దేరుతాడు. వివేక్ చేసిన ఈ ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అసలు నేరస్థుడిని కనిపెడతాడా? ఈ కేసు వెనకాలున్న అసలు కోణం ఏంటో తెలుసుకుంటాడా? అన్నది కథ. వరుణ్ సందేశ్‌కు ఇలాంటి పాత్ర చాలా కొత్త. ఇంత వరకు మనం వరుణ్ సందేశ్‌ను లవర్ బాయ్ ఇమేజ్‌లోనే చూశాం. కానీ ఇందులో వరుణ్ సందేశ్ చాలా సీరియస్‌గా కనిపిస్తాడు. ఎంతో సెటిల్డ్‌గా నటిస్తాడు. వివేక్ పాత్రకు సరిగ్గా సరిపోయాడు. ఇక బాలరాజుగా ఛత్రపతి శేఖర్ తన అనుభవాన్ని చూపించాడు. క్యూ మధు, అన్నీ, శ్రేయ రాణి పాత్రలు బాగుంటాయి. జడ్జ్‌గా తనికెళ్ల భరణి, మైమ్ మధు ఇలా ఇతర పాత్రలన్నీ కూడా బాగుంటాయి. కాంద్రకోట మిస్టరీ బేస్డ్ సినిమా అని, యధార్థ సంఘటనల ఆధారంగా తీసిన చిత్రమని ముందు నుంచీ హైప్ పెంచేశారు. దానికి తగ్గట్టుగానే టీజర్, ట్రైలర్‌లు మరింత ఆసక్తిని పెంచేశాయి. దానికి తోడు వరుణ్ సందేశ్‌కు ఇది చాలా కొత్త పాత్ర.. కొత్త సినిమా. దీంతో ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్ ఏర్పడింది. నింద మూవీకి రిలీజ్ కంటే ముందే పాజిటివ్ వైబ్ ఏర్పడింది.

## 'కాలా'కు అరుదైన గౌరవం



'నేల నీకు అధికారం.. అది మాకు జీవితం" అంటూ తాము జీవించే నేలను దక్కించుకోవడానికి ప్రజల్లో స్ఫూర్తినింపే కరికాలుడుగా 'కాలా' చిత్రంలో కనిపించి మంచి ప్రశంసలు అందుకున్నారు అగ్రకథానాయకుడు రజనీకాంత్. ఆయన ప్రధాన పాత్రలో పా.రంజిత్ తెరకెక్కించిన చిత్రమిది. 2018లో విడుదలైన ఈ యాక్షన్ చిత్రం బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అయినా అధికారం కోసం ఉన్నత.. అణగారిన వర్గాల మధ్య జరిగే పోరాటాన్ని చూపించిన విధానం ప్రేక్షకులను మెప్పించింది. తాజాగా ఈ సినిమాకు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటిష్‌ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ సైట్ అండ్ సౌండ్ మ్యాగజైన్‌లో 21వ శతాబ్దాపు అద్భుతమైన 25 చిత్రాల జాబితాలో 'కాలా'కు స్థానం లభించింది. దీంతో పాటు ఈ మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ చిత్రమిదే కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అనేక చిత్రాలను విశ్లేషించి విడుదల చేసిన ఈ జాబితాలో 'ఓల్డ్ బాయ్', 'గెట్ అవుట్' లాంటి సినిమాలు ఉన్నాయి. "21వ శతాబ్దం నాలుగు భాగాల్లో ఒక భాగం ముగింపుకు వచ్చిన నేపథ్యంలో మా దగ్గర ఉన్న 25మంది అత్యుత్తమ సినీ విమర్శకుల విశ్లేషణ ఆధారంగా ఈ అరుదైన మైలురాయిని ఆవిష్కరిస్తున్నాం. 2000-2024 మధ్య వచ్చిన సినిమాల్లో అన్ని విభాగాల్లోనూ మంచి ప్రదర్శన కలిగిన 25 చిత్రాలను ఎంపిక చేశాం. ప్రతి సంవత్సరం ఒక్కో సినిమాను తీసుకున్నాం" అని బీఎఫ్ఐ ఓ ప్రకటనలో తెలిపింది.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154